# ప్రతిపక్షం
www.prathipaksham.in

బుధవారం 04.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 315 పేజీలు:9 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఢిల్లీ 9

# అమెరికాతో ట్రేడ్ డీల్.. సహనమే గెలిపించింది

## ఇప్పుడు ప్రపంచ వ్యవహారాల్లో కీలక శక్తిగా భారత్

- రాబోయే 25 ఏళ్ల దృష్టితో 2026 బడ్జెట్
- న్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ
- ప్రధానిని సంత్కరించిన కేంద్రమంత్రులు, ఎంపీలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 :** భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతి పెద్ద ఈవెంట్ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచ వేదికపై భారత్‌కు పెరుగుతున్న ప్రభావాన్ని ఈ ఒప్పందం స్పష్టంగా ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగించారు. 'భారత్ ఇప్పుడు ప్రపంచ వ్యవహారాల్లో కీలక శక్తిగా ఎదుగుతోంది. గ్లోబల్ సమతుల్యతను కాపాడడంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భారత్ ప్రపంచ వేదికపై నిర్ణయాత్మక శక్తిగా ఎదగడం ఈ శతాబ్దపు అతిపెద్ద ఈవెంట్. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రజలు మమ్మల్ని విమర్శించారు. అయినా సహనంతో ఉన్నాం. అదే ఇప్పుడు గెలిపించింది. ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించింది. వాణిజ్య చర్చల పట్ల ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది

...:: మిగతా 2లో

“

మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సర్వే లలో వెనకబడిన మున్సిపాలిటీలను సీఎం విశ్లేషించారు. జిల్లా పర్యటన వివరాలు తెలుసుకున్న సీఎం, ఎప్పటికప్పుడు ఇంచార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారీగా రిపోర్ట్ తనకు అందించాలని చెప్పారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిందే!

## మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలి

- ఇంచార్జి మంత్రులు సమిష్టిగా పని చేయాలి
- ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదే
- మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- 90 శాతం స్థానాలు గెలుస్తున్నాం: పీసీసీ చీఫ్
- మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, ఫిబ్రవరి3:** మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనంటూ మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో రాజకీయ పరిణామాలపై చర్చించారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల రాజకీయ పరిణామాలపై విస్తృతస్థాయిలో

...:: మిగతా 2లో

# రెండేళ్లయినా అందని రెండు లక్షల ఉద్యోగాలు

- తెలంగాణలో రిక్రూట్‌మెంట్ జీరో
- నిరుద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగలడం ఖాయం
- మాట తప్పిన సీఎం, ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్, తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో "రిక్రూట్ మెంట్ జీరో"గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు. అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై పనిగట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని అన్నారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని

...:: మిగతా 2లో

# కేబినెట్ నిర్ణయం ఉంటే చాలు

- ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పాం
- కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత
- తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చన్న సుప్రీంకోర్టు. తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకెట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. 2024 ఆగస్టు 16న కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని నెలల తర్వాత వీరిని పదవుల నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి

...:: మిగతా 2లో

# నా హక్కును హరిస్తున్నారు

- ప్రభుత్వ ఆదేశాలతో ఇలా జరిగింది
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ
- పార్లమెంటు చరిత్రలో తొలిసారి
- ప్రభుత్వ ఆదేశాలతో ఇలా జరిగిందన్న రాహుల్
- అధికార, విపక్షాల వాగ్యుద్ధంతో సభలో గందరగోళం
- ఎనిమిది మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 :** లోక్‌సభలో మాట్లాడేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా తనకు వచ్చిన హక్కును హరిస్తున్నారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నాయకుడు మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకున్నారని విమర్శించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన రాహుల్, పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారిగా ఇలా జరిగిందని చెప్పారు. ఇది మన ప్రజాస్వామ్యానికి మచ్చని, దీనికి వ్యతిరేకంగా నిరసనను తెలియజేస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. జాతీయ భద్రతకు

...:: మిగతా 2లో

# సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్

- పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు
- ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా ప్రచారం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్ల సింగరేణి భ్రష్టు పట్టింది
- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బడ్జెట్ సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం

...:: మిగతా 2లో

# మజ్లిస్ నేత పాషాఖాద్రీ ఇక లేరు

- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పాషాఖాద్రీ

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి3:** మజ్లిస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే మహ్మద్ పాషాఖాద్రీ (72) మంగళవారం రాత్రి తన నివాసంలో కన్నుమూశారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఖాద్రీ కొంతకాలంగా నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల దవాఖాన నుంచి ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్న ఆయన మంగళవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో ఇంట్లోనే మృతి చెందారు. పాషా ఖాద్రీ చార్మినార్, యాకుత్‌పురా నియోజకవర్గాల నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. నూర్‌ఖాన్ బజార్‌లోని మస్జిద్ ఎ హజ్రత్ సయ్యద్ మొహియుద్దీన్ పాషా శ్మశానంలో బుధవారం మధ్యాహ్నం 1:20గంటలకు అంత్యక్రియలు జరుగనున్నాయి.

## ఎగుమతులు పెరుగుతాయ్

భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను 50శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. ఇకపై భారత ఎగుమతులు పుంజుకుంటాయని అన్నారు.

8

## మణిపూర్ సీఎంగా ఖేమ్ చంద్ సింగ్

స్థానిక తెగల మధ్య ఆధిపత్య పోరుతో సతమతమవుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న ముఖ్యమంత్రి పదవికి యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు.

8

## ఎనిమిది మంది ఎంపీల సస్పెన్షన్

లోక్‌సభలో మంగళవారం 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పేపర్లు చించి చైర్‌పై విసిరేసిన ఘటనలో ఈ చర్యలు తీసుకున్నారు. చైర్‌లో దిలీప్ సైకియా ఉన్న సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పేపర్లను చించి విసిరేశారు.

8

## లక్షల్లో ఓట్లు తొలగించారు

కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

8

రాష్ట్రీయం

రన్‌వేపై ఉండగానే రెండు విమానాల రెక్కలు ఢీకొన్నాయి. మహారాష్ట్ర ముంబై ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రన్‌వేపై ఉండగానే ఎయిరిండియా, ఇండిగో విమానాల రెక్కలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఎయిరిండియా విమానం ముంబయి నుంచి కోయంబత్తూరు వెళ్తుండగా, ఇండిగో విమానం హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లింది.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిందే!

మొదటిపేజీ తరువాయి

చర్చించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరపున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది. అందులో భాగంగా మంగళవారం పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చిస్తున్నారు. పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా పరిస్థితులపై చర్చ ముగిసిన తరువాత ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

**మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలి**

మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సర్వేలలో వెనకబడిన మున్సిపాలిటీలను సీఎం విశ్లేషించారు. జిల్లా పర్యటన వివరాలు తెలుసుకున్న సీఎం, ఎప్పటికప్పుడు ఇంచార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారీగా రిపోర్ట్ తనకు అందించాలని చెప్పారు.

**అసంతృప్తి నేతలను బుజ్జగించాలన్న సీఎం**

మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి మంత్రులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని అన్నారు. కచ్చితంగా అన్ని స్థానాలు గెలవాల్సిందేనని, పాత-కొత్త నేతల సమన్వయంతో పనిచేయాలని, గెలుపు బాధ్యత ఆయా పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిదేనని సీఎం స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ తమ ఇంచార్జి నియోజకవర్గాల్లోనే ఉండి మానిటరింగ్ చేయాలని, ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్, వార్‌రూమ్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

**90 శాతం స్థానాలు గెలుస్తున్నాం: పీసీసీ చీఫ్**

పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ 90 శాతం స్థానాలు గెలుస్తున్నామని, ఈ ఎన్నికల్లో తమకు పోటే లేదని, మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామని అన్నారు. రెబల్స్ బెడద లేదని, అంతటా విత్ డ్రా అయ్యారని తెలిపారు. జగిత్యాల విషయంలో పరిశీలిస్తున్నామని సమస్య రేపటితో ముగుస్తుందన్నారు. ఏపార్టీతో మాకు పొత్తులేదని, డిప్యూటీ సీఎం, అడ్లూరి లక్ష్మణ్ జిల్లాల్లో ఉండి రాలేక పోయారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలు లేని నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్ లకు బాధ్యతలు ఇవ్వనున్న టీపీసీసీ వర్గాలు తెలిపాయి.

# రైతులతో మంత్రి తుమ్మల ముఖాముఖి

- యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 3:** మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు, డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు మరియు వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలి అని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో - పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్.. సహనమే గెలిపించింది

మొదటిపేజీ తరువాయి

నిదర్శనం. ఇది భారత ఎగుమతులు, పెట్టుబడులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు తెస్తుంది' అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

**రాబోయే 25 ఏళ్ల దృష్టితో 2026 బడ్జెట్**

కేంద్ర బడ్జెట్ 2026ను రాబోయే 25 సంవత్సరాల దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించామని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ ఉద్దేశాలు, దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని ఎన్‌డీఏ ఎంపీలకు ప్రధాని సూచించారు. బడ్జెట్‌లోని ప్రాధాన్యాంశాలను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం ఎంపీల బాధ్యత అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా అనేక చిన్న పార్టీలూ ఎన్‌డీఏతో చేతులు కలుపుతున్నాయని ప్రధాని చెప్పారు. ఇప్పుడు ఎన్‌డీఏతో కలిసిన పార్టీల సంఖ్య 50 శాతానికి మించిపోయిందని అన్నారు. ఇది దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా ఎన్‌డీఏ రాజకీయ దృక్పథానికి పెరుగుతున్న ఆదరణను చూపిస్తోందని పేర్కొన్నారు.

**ప్రధాని నాయకత్వంలో చారిత్రక వాణిజ్య ఒప్పందాలు: కిరణ్ రిజిజు**

ప్రధాని నాయకత్వంలో చారిత్రక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఇటీవలే భారత్ తొమ్మిది వాణిజ్య ఒప్పందాలు పూర్తి చేసిందని తెలిపారు. 39 అభివృద్ధి చెందిన దేశాలతో ఎఫ్‌టీఏలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇది దేశానికి చారిత్రక ఘట్టమని చెప్పారు. అంతకుముందు భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో ప్రధాని నరేంద్ర మోదీని కేంద్రమంత్రులు, ఎంపీలు సత్కరించారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో బీజేపీ, టీడీపీ, జేడీయూ, ఎల్‌జేపీఆర్ శివసేన, జేడీఎస్ సహా ఎన్‌డీఏలోని ఇతర పార్టీల ఎంపీలు హాజరయ్యారు. రాజకీయం, పాలనాపరమైన అంశాలు సహా బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధాని, ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

**దేశ భవిష్యత్తును మార్చే ఒప్పందం: పీయూష్ గోయల్**

అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఈ డీల్‌ను భారత భవిష్యత్ మార్చే ఒప్పందమని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అభివర్ణించారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల ప్రయోజనాలకు ఎలాంటి రాజీ లేకుండా అమెరికాతో భారత్ అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాన్నికుదుర్చుకుందని పీయూష్‌గోయల్ తెలిపారు.

# కేబినెట్ నిర్ణయం ఉంటేచాలు

మొదటిపేజీ తరువాయి

దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు. సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇది ఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది.

# సుస్థిర ప్రగతికి దోహదపడేలా కేంద్ర బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

**పీఎంఏవై కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు**

ప్రతి జిల్లాకు బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని వివరించారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాజీపేట రైలు మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 70 శాతం పూర్తయ్యాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. కొమురవెల్లి, జోగులాంబ స్టేషన్లను త్వరలోనే ప్రారంభించబోతున్నట్లుగా చెప్పారు. ఇప్పటికే 5 వందే భారత్, రెండు అమృత్ భారత్ రైళ్లను కేంద్రం తెలంగాణకు ఇచ్చిందన్నారు. కవచ్ సాంకేతికత ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆ పనులు రాష్ట్రంలో వేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలోనే కవచ్ పనులు పూర్తిచేసుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. రైల్వే హబ్‌గా కూడా హైదరాబాద్ కాబోతుందన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లుగా కిషన్ రెడ్డి వివరించారు. ఐటీ, డిజిటల్, హైస్పీడ్ రైలు కారిడార్ లాంటి పలు అంశాలకు పెద్దపీట వేయడం జరిగిందని కిషన్ రెడ్డి వివరించారు. 23 లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలు తెలంగాణలో ఉన్నాయన్న ఆయన ఈ బడ్జెట్ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. గ్లోబల్ బయో ఫార్మాహబ్‌గా హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ కోసం హైదరాబాద్‌కు నిధులు కేటాయిస్తామని వివరించారు. కర్ణాటక తర్వాత తెలంగాణ ఐటీ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్న ఆయన ఈ రంగంలో పన్నులు తీసుకురావడం ఎంతో మేలన్నారు. పార్లమెంటులో ఒక్క ఎంపీ ఉన్న కమ్యూనిస్టులు మోదీని గద్దెదించుతారా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ముందు కమ్యూనిస్టుల పార్టీలు కనుమరుగు కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. ఎస్ఐఆర్ దేశం అభివృద్ధి కోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అర్థం కాకపోతే ఏం చేస్తామని ఎద్దేవా చేశారు

# రెండేళ్లయినా అందని రెండు లక్షల ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి

అన్నారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు 2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి..**

రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల బరిలో భారత రాష్ట్ర సమితి ఘనవిజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగరవేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, మున్సిపల్ కోఆర్డినేటర్లు మరియు జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని, ఇచ్చిన హామీల అమలులో విఫలమై మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బీజేపీలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా అందరి సమన్వయం కీలకమని కేటీఆర్ స్పష్టం చేశారు. చాలా చోట్ల పార్టీ విజ్ఞప్తిని మన్నించి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికి అభ్యర్థులు స్వయంగా వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. వారికి తగిన గౌరవం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉందన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని సూచించారు. చివరి ఘట్టమైన ప్రచారంపై దృష్టి సారిస్తూ, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు మరియు మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడం పైన కూడా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని సూచించారు.

# నా హక్కును హరిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

సంబంధించిన అంశంపై లోక్‌సభలో తనను మాట్లాడకుండా అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశంపై మాట్లాడుతుంటే అడ్డుకున్నారని రాహుల్ గాంధీ అన్నారు. గత స్పీకర్ల తీర్పులను పరిశీలించినా, దీర్ఘకాలంగా వస్తున్న సంప్రదాయం ప్రకారం సభలో ఒక పత్రాన్ని ప్రస్తావించాలనుకునే సభ్యుడు దానిని ప్రామాణీకరించి, దానిలోని విషయాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తాను అదే చేశానని స్పీకర్‌కు రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ ఆ పత్రాన్ని ఉదహరించడానికి లేదా ప్రస్తావించడానికి సభ్యుడికి అనుమతిస్తారని గుర్తు చేశారు. సభ్యుడు లేవనెత్తిన అంశంపై స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. అయితే, ఎంపీలు ఏదైనా డాక్యుమెంట్ ను ధ్రువీకరించాలంటే తమకు తెలిసినంత వరకు అందులోని విషయాలు సరైనవేనని పేర్కొంటూ సంతకం చేసిన కాపీని సమర్పించాల్సి ఉంటుంది.

**సభలో గందరగోళం**

అంతకుముందు అమెరికాతో వాణిజ్య ఒప్పందం, ఆర్మీ మాజీ చీఫ్ నరవాణె వ్యాఖ్యల అంశాలపై లోక్‌సభ దద్దరిల్లింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగం మొదలుపెట్టిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆర్మీ మాజీ చీఫ్ రిటైర్డ్ జనరల్ ఎంఎం నరవాణె వ్యాఖ్యల అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై అధికార పక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే అధికారవిపక్షాల వాగ్యుద్ధంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో స్పీకర్ మధ్యాహ్నం 3గంటల వరకు సభను వాయిదావేశారు.

**ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్**

ఆ తర్వాత తిరిగి సమావేశం కాగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. ఆర్మీ మాజీ చీఫ్ నరవాణె వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు ఎంపీలు స్పీకర్‌పై పేపర్లు విసిరారు. వారి తీరుపై ప్యానల్ స్పీకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ సూచన మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో అనుచితంగా ప్రవర్తించిన సభ్యులను సస్పెండ్ చేయాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. 8మంది ప్రతిపక్ష సభ్యులు హిబి ఈడెన్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణిక్కం ఠాగూర్, గుర్జీత్ సింగ్ ఔజ్లా, కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ పాడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియాకోస్‌ను ఈ పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. విపక్ష పార్టీల సభ్యులు ఆందోళనకు దిగటంతో లోక్ సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

# రాష్ట్రానికి దక్కాల్సిన నిధులపై ప్రత్యేక కార్యాచరణ

- రూపొందించలని అధికారులకు సీఎస్‌రామకృష్ణారావు ఆదేశం
- ప్రభుత్వ కార్యదర్శులతో సమావేశం.. కేంద్ర బడ్జెట్ పై కసరత్తు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026- 27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో జనాభా ప్రాతిపదికన రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా జనాభా ప్రాతిపదికగా తెలంగాణాకు కనీసం రూ 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, ఈ విషయంలోసంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సీవీ ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్యసాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

"ఇలాంటి భయంకరమైన భారత జట్టును తాను గతంలో ఎన్నడూ చూడలేదు. ఎలాంటి సమయంలోనైనా ఒత్తిడిని జయించ గల జట్టుగా టీమిండియా తయారైంది. ఇదే ఊపు కొనసాగిస్తే కచ్చితంగా భారత జట్టు టీ20 వరల్డ్ కప్ భారత జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుంది..

- మహేంద్ర సింగ్ ధోనీ, భారత మాజీ కెప్టెన్

# మున్సిపాలిటీల్లో అభివృద్ధి ఏం చేశారు?

- కాంగ్రెస్–బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్
- తెలంగాణ జాగృతి రాష్ట్ర నేతలుకోళ్ల శ్రీనివాస్, నవీన్ ఆచారి
- జాగృతి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చిందని, కానీ మున్సిపాలిటీల పరిధిలో జరిగిన అభివృద్ధిని మాత్రం ప్రజలకు చెప్పలేకపోతుందని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల శ్రీనివాస్, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించినట్లుగానే ఆగమాగంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని, గ్రామ పంచాయితీలను మున్సిపాలిటీల్లోకి, మున్సిపాలిటీలను కార్పొరేషన్లలో కలపడం తప్ప వాస్తవ అభివృద్ధి ఏమీ చేయలేదని ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క వర్షం పడితే నగరం అస్తవ్యస్తమయ్యే పరిస్థితి ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. జాగృతి మద్దతుతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి తమ అభ్యర్థులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల కోసం పనిచేసే కవిత త్వరలోనే పార్టీ ఏర్పాటు చేయనున్నారని, ఆమె పెట్టబోయే పార్టీ కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. కవిత మద్దతిస్తున్న అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల హడావుడి నడుస్తోందని, కానీ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు మున్సిపాలిటీలకు ఏం చేశామన్నదానిపై మాట్లాడకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో నోటీసులు ఇవ్వడం, జనాన్ని పోగు చేసి హంగామా చేయడం తప్ప ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు. మున్సిపాలిటీల్లో తాగునీరు మోరి నీటితో కలుషితమవుతోందని, పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, నగరాల్లో పార్కులు, చెరువుల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. ఈ విషయాలపై యువత ప్రశ్నిస్తే బాధ్యతారహిత సమాధానాలు ఇస్తున్నారని అన్నారు. కవిత జనంబాటలో ప్రజల నుంచి అనేక సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని, కానీ వాటిలో ఎన్ని సమస్యలు పరిష్కరించారో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వచ్చే అభ్యర్థులను ప్రజలు నిలదీయాలని, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ కోరాలని సూచించారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి అభ్యర్థులు సింహం గుర్తు పైన పోటీ చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే జాగృతి అభ్యర్థులను గెలిపించాలని నవీన్ ఆచారి విజ్ఞప్తి చేశారు.

## ముఖ్యమంత్రికి మంత్రుల అభినందనలు

ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21st సెంచరీ' ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు అభినందించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, కొండా సురేఖ, అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సీఎం నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేశారు.

\- ప్రతిపక్షం, హైదరాబాద్

# దెయ్యాలు వేదాలు వల్లించినట్టే కేటీఆర్ వ్యాఖ్యలు

- ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 2 :** దెయ్యాలు వేదాలు వల్లించినట్టే కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ అన్నారు. నిరుద్యోగుల గురించి కేటీఆర్ మాట్లాడటం చూస్తే చంపిన వ్యక్తే మళ్లీ వచ్చి సంతాపం తెలిపినట్లుగా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో నిరుద్యోగులను కలవడానికి కూడా అపాయింట్ మెంట్ ఇవ్వని వ్యక్తి, ఇప్పుడు వారి గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ పాలనలోనే నిరుద్యోగులకు నిజమైన న్యాయం జరుగుతోందని పేర్కొన్న ఆయన, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. మరిన్ని ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకు అనుగుణంగా టీజీపీఎస్సీ ఇప్పటికే ప్రాసెస్ ప్రారంభించి అభ్యర్థుల రిజిస్ట్రేషన్ కొనసాగిస్తోందని వెల్లడించారు. త్వరలోనే మరికొన్ని నియామకాల కోసం కొత్త నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని స్పష్టం చేశారు. కేటీఆర్ పదేళ్ల పాలనలో లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం కేవలం మాటలకే పరిమితమని విమర్శించారు. వాస్తవంగా ఎంతమేరకు ఉద్యోగాలు ఇచ్చారో, ఉద్యోగాలను అంగట్లో సరుకుల్లా ఎలా అమ్ముకున్నారో అందరికీ తెలుసన్నారు. పదో తరగతి పరీక్షల నుంచి గ్రూప్-1 వరకు పేపర్ లీక్‌లతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నది మీరే కాదా అని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు న్యాయం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. దీనిని జీర్ణించుకోలేక కేటీఆర్ ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, ఆయన వ్యాఖ్యలు తమనే తాము సంతాపం తెలిపినట్టుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా నియామకాల వారీగా వివరాలు వెల్లడించిన డా. బలంరు వెంకట్, ప్రతిపక్షాల మాటలను నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు.

# విద్యుత్ షాక్ తో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

**ప్రతిపక్షం, వికారాబాద్, ఫిబ్రవరి 3:** విద్యుత్ షాక్ తో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన యాలాల మండలం కోకట్ గ్రామంలో చోటు చేసుకుంది. కోకట్ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ (45) యాలల మండలం రాస్నం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో హిందీ పండితుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం కోకట్ గ్రామంలో తన ఇంట్లో ఉన్న పిండి గింద్రికి మరమత్తులు చేస్తుండగా విద్యుత్ శాఖ గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# జనగణనలో కులగణన చేపట్టాలి

- లేకపోతే ఢిల్లీ గద్దె దించుతాం
- మాట తప్పితే దేశ అగ్గి రాజేస్తాం
- గెజిట్ నోటిఫికేషన్ సవరించి ఓబీసీ కాలమ్ చేర్చాలి
- సమగ్ర కులగననపై పార్లమెంట్ సమావేశాలలో చర్చ పెట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 3:** వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీ నుండి దేశవ్యాప్తంగా జరగనున్న జాతి జనగణనలో బీసీ కులగలనా చేపట్టాలని, బీసీ కులదరణ పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గితే ఢిల్లీలోని ప్రభుత్వాన్ని బీసీలు ఏకమై గద్దె దించుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం హైదరాబాదులో బషీర్‌బాగ్‌ప్రెస్ క్లబ్లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ లతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1931 సంవత్సరంలో జరిగిన కులగణన తర్వాత బీసీల మూడు దశాబ్దాల పోరాట ఫలితంగా గత సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో జనగణతో పాటు కులగణన కూడా చేపడతామని నిర్ణయం తీసుకున్నారని, ఆ నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కేంద్రం దీన్ని పూర్తిగా విస్మరిస్తుందని ఆయన ఆరోపించారు. జనవరి 22, 2006రోజున కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 33 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నోటిఫికేషన్ లో 12వ ప్రశ్న లో మీరు ఎస్సీనా, ఎస్టీనా లేదా మీరు ఇతరుల అని అడిగిందని ఇతరులు అన్నచోట ఓబీసీ నా అని ప్రశ్నావళిలో అని అడిగితే కేంద్ర ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఓబీసీ కాలాన్ని ప్రత్యేకంగా చేర్చక పోవడం మూలంగా దేశవ్యాప్తంగా ఉన్న 70 కోట్ల మంది బీసీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ పదం లేనందుకు నిరసిస్తూ మీడియా సమావేశంలోని గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించివేసి తమ నిరసన తెలియజేశారు. జనగణలో కులగలను కూడా చేరుస్తామని బీసీలకు హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేసి చేయాలని చూస్తే బీసీలు అంతా సంఘటితమై దేశంలో అగ్గి రాజస్తారని ఆయన హెచ్చరించారు. బీసీ కులగన్న చేపట్టకుండా నియోజకవర్గల పునర్విభజనలో, మహిళా బిల్లు లో బీసీ మహిళలకు సబ్ కోటా దక్కదని, దేశంలో 50 శాతం విధించిన పరిమితి ఎత్తివేయరని, బడ్జెట్, విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా ఒక హక్కుగా చట్టబద్ధంగా దక్కకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ కులగలను పై ప్రత్యేకంగా చర్చ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న 27 మంది ఓబీసీ మంత్రులు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు మూడు రోజుల్లోనే దేశవ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్రాల ఓబీసీ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జేఏసీ కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సాగర్, దీటి మల్లయ్య, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, సత్యరాజు గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, విజయలక్ష్మి, కరుణ, ఇంద్రమ్ రజక, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీపై హైడ్రా అవగాహన కార్యక్రమాలు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరబాద్, ఫిబ్రవరి 3:** నగరంలో అగ్ని ప్రమాదాల నివారణకు హైడ్రా అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. నాంపల్లిలోని ఫర్నీచర్ షోరూంలో జరిగిన అగ్ని ప్రమాదంతో పాటు, నగరంలో జరిగిన పలు ఘటనల నేపథ్యంలో నగర ప్రజలను అప్రమత్తం చేయడానికి చర్యలు తీసుకుంది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినట్టు ఇటీవల జరిగిన తనిఖీల్లో వెల్లడైన తర్వాత.. పెద్దయెత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని హైడ్రా గుర్తించింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు తూచా తప్పకుండా పాటించేందుకు నెల రోజులు గడువు ఇస్తూనే.. అవగాహన కార్యక్రమాలను కూడా హైడ్రా చేపట్టింది. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే ఎలా మంటలను అదుపులోకి తీసుకురావాలి, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే విధానాలను ఈ సందర్భంగా హైడ్రా వివరించింది. ఫైర్ ఎక్స్టింగ్విషర్లు వినియోగించడం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే వాటర్ స్ప్రింక్లర్ల పనితీరు, స్మోక్ డిటెక్టర్లపై అవగాహన కల్పించారు. పంజాగుట్ట, నార్సింగి, మెట్టుగూడ, కార్వాన్, షాపూర్‌నగర్, ఏ ఎస్ రావు నగర్, చందానగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఉప్పల్, బేగంపేట, చాంద్రాయణగుట్ట, సంతోష్ నగర్, జూబ్లీ హిల్స్ రోడ్డు నంబరు 45, లక్డీకాపూల్, మాధాపూర్, సనత్‌నగర్, రేతిబౌలి క్రాస్ రోడ్స్, నాగార్జున సర్కిల్, గచ్చిబౌలి, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, అల్వాల్, బడంగపేట్, అల్కాపురి క్రాస్‌రోడ్స్, అత్తాపూర్, బంజారాహిల్స్, క్లాక్ టవర్ సర్కిల్, ఈసీఐఎల్, కొంపల్లి, నాంపల్లి, శంషాబాద్, పెద్దఅంబర్‌పేట, బాచుపల్లి, తూముకుంట తదితర ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్మికులు, వ్యాపారులు ఎలా భద్రంగా ఎలా బయట పడాలో సూచించారు. షాపులలో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను గుర్తించడం.. మంటలంటుకుంటే అగ్నిమాపక శాఖకు చెందిన 101తో పాటు, హైడ్రా కంట్రోల్ రూమ్ 1070, 9000113667 కు ఫోను చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్ నిర్వహించారు.

# ప్రజల కోసం పనిచేస్తా...

**ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 3:** ప్రజల కోసం పనిచేసే నాయకుని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని 2వ వారు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి సుశీల జంగం యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి, కారు గురుకు ఓటు వేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.... ప్రజలు ఆదరించి అవకాశం ఇస్తే అభివృది చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి కాలనీలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే మనదే విజయం

- టిక్కెట్ రాని నేతలు అధైర్య పడొద్దు
- పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులలో వారికి ప్రాధాన్యం
- ఐక్యంగా పనిచేస్తే ఐదు మున్సిపాలిటీలు మనవే
- బీఫాంలు అందించిన మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు, పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్తే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఐదు మున్సిపాలిటీల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ ఫాం లను అశోక్ నగర్ లోని కాట నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు ఉన్న నాయకులనే కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించినట్లు చెప్పారు. టికెట్ల కేటాయింపులు సర్వే ఆధారంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు వివరించారు. టికెట్లు రాని అభ్యర్థులు అధైర్య పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులలో టికెట్ రాని నేతలకు పెద్దపీటవేస్తామని హామీ ఇచ్చారు. ఆ నేతలు నిరుత్సాహపడకుండా ఆయా వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్ అంటే "భూ రక్షసుల సమితి"

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 3 :** బీఆర్ఎస్‌ను "భూ రాక్షసుల సమితి"గా అభివర్ణించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆ పార్టీ 10 ఏళ్ల పాలనలో కనిపించిన ప్రతి భూమిని కబ్జా చేసి ప్రజలను అరిగోస పెట్టిందని తీవ్రంగా విమర్శించారు. పొరపాటున మళ్లీ బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తే ప్రజల ఇళ్లను కూడా కబ్జా చేస్తారని హెచ్చరిస్తూ కెసిఆర్, కేటీఆర్ లను ఉతికి పారేశారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్ చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకబ్జాలు విస్తృతంగా జరిగాయని, అలాంటి 46 మంది నాయకులను జైలుకు పంపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. "వాళ్లకు రెండు లక్ష్యాలే... ఎవరి పొట్ట కొట్టాలి, ఎట్లా పైసలు సంపాదించాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నయాపైసా లేదని, సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డే అంగీకరించారని అన్నారు. 6 గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రూ.1500 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చానని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలతో బుక్‌లెట్‌ను ఇంటింటికీ పంపిస్తున్నామని తెలిపారు. ఆ వివరాల్లో ఏదైనా తప్పుంటే తనపై కేసు పెట్టుకోవచ్చని సవాల్ విసిరారు. స్మార్ట్ సిటీ నిధులతోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, ఆల్కాపురి కాలనీ అభివృద్ధి, పెద్దపోచమ్మ టెంపుల్ రోడ్డు వంటి పనులు జరిగాయని వివరించారు. డంపింగ్ యార్డ్ సమస్యకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించిన సంజయ్, బీజేపీకి మేయర్ పీఠం అప్పగిస్తే కేంద్రంతో పోరాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ప్రధాని మోదీని ఒప్పించి భారీగా నిధులు తీసుకొస్తానని, ఇప్పటివరకు వచ్చిన నిధులన్నీ కేంద్రం ఇచ్చినవేనని సంజయ్ స్పష్టం చేశారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

“

డిజిటల్ చెల్లింపులు జరిపేవారి సంఖ్య పెరగడంతో భారత యూపీఐ లావాదేవీలు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ వరకు యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో రూ.230 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. 2022-23లో జరిగిన మొత్తం రూ.139 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. భారత్ వెలుపలా యూపీఐ వినియోగం పెరగడం హర్షణీయమన్నారు.

\- ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి

ఓపెన్ వాయిస్

# బంగారం, వెండి ధరల దోబూచులాట

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా పతనం మొదలైంది. ఆ పతనం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచ సంక్షోభం కారణంగా గత సంవత్సరం రికార్డు స్థాయిలను తాకినప్పటికీ, గత మూడు, నాలుగు రోజులుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. తత్ఫలితంగా, ఈ తగ్గుదల సమయంలో బంగారం, వెండిని కొనడం మంచిదేనా లేదా ధరలు మరింత తగ్గే వరకు వేచి ఉండటం మంచిదా అని పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. నిజానికి, ఈ వారం రికార్డు గరిష్టాలను చేరుకున్న తర్వాత బులియన్ మార్కెట్లో గణనీయమైన తగ్గుదల డాలర్ బలోపేతం కావడం, అమెరికా ద్రవ్య విధానంపై పెరుగుతున్న అంచనాల కారణంగా నమ్ముతారు. అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిర పరిస్థితుల మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితంగా భావించడంతో జనవరిలో పుత్తడి ధరలు కొత్త రికార్డులను తాకాయి.అయితే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ కెవిన్ వార్ష్ పేరు ప్రతిపాదించిన తరువాత మార్కెట్లలో లోహాల ధరలు శుక్రవారం పతనం కావడం ప్రారంభమైంది.వార్ష్ పేరును ఫైనాన్షియల్ మార్కెట్లు స్వాగతించాయి. శుక్రవారం అనేక దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు డాలర్ విలువ 1 శాతం పెరిగింది. డాలర్ పుంజుకోవడంతో, 1983 తర్వాత బంగారం ధరల్లో ఒకే రోజు ఈ స్థాయిలో భారీ పతనం నమోదైంది. బంగారం ధర 9 శాతం, వెండి ధర 27శాతం పడిపోయింది. బంగారం, వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ట్రంప్ పరిపాలన అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తుందనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఇది వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను పెంచింది, ఇది డాలర్, విలువైన లోహాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఇంకా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, దీర్ఘకాలిక విధాన సంకేతాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.దేశీయంగా, బడ్జెట్ 2026లో బంగారం, వెండికి సంబంధించి ఎటువంటి ప్రధాన ప్రకటనలు లేవు. దేశీయంగా గట్టి మద్దతు ఇచ్చే ప్రకటలు కూడా లేకపోవడం కూడా మరో కారణం. మార్కెట్లు ఇప్పుడు రాబోయే ఆర్బీఐ నిర్ణయాలు, యూఎస్ ఉపాధి డేటా, పిఎంఐ డేటాపై దృష్టి సారించాయి, ఇవి ధరలు స్థిరీకరిస్తాయా లేదా మరింత అస్థిరతను చూస్తాయా అని నిర్ణయిస్తాయి.ప్రస్తుతానికి బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోడీ ప్రకారం, రాబోయే కాలంలో ఈ లోహాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉండవచ్చు, కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఇంతలో, ఆదివారం వరుసగా రెండో రోజు కూడా తగ్గుదల కొనసాగింది, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు తొమ్మిది శాతం తగ్గి ₹ 2.65 లక్షలకు చేరుకోగా, బంగారం మూడు శాతం తగ్గి 10 గ్రాములకు ₹ 1.47 లక్షలకు చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో మార్చి నెలలో డెలివరీ చేయాల్సిన వెండి ధర లోసర్క్యూట్‌ను తాకింది. జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈబీజీకమోడిటీ & కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ ప్రకారం, దేశీయ మార్కెట్లో బంగారం దాని ఆల్‌టైమ్ గరిష్ఠస్థాయి నుంచి దాదాపు 20 శాతం తగ్గింది, వెండి దాదాపు 37 శాతం తగ్గింది, ఇది ఇటీవలి లాభాల బుకింగ్, ధరలలో ర్యాలీ తర్వాత సహజ క్షీణతను ప్రతిబింబిస్తుంది.విలువైన లోహాలకు 2025 అద్భుతమైన సంవత్సరంగా నిలిచింది. 1979 తర్వాత బంగారం అత్యధిక వార్షిక లాభాల్ని నమోదు చేసింది.ట్రంప్ సుంకాల భయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన షేర్ల ధరలు పెరగవచ్చనే అంచనాలమధ్య ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన ఏర్పడటంతో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డుల్ని తాకాయి.బంగారం ధర ఈ ఏడాది జనవరి చివరి నాటికి 5,500 డాలర్లను దాటింది, వెండి ధర కూడా 'ఆల్‌టైమ్ హై'కి చేరింది.2026లో ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని వాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ఆకర్షణీయ పెట్టుబడిగా మారుతుంది. గత ఏడాది కాలంలో అమెరికా సుంకాల వంటి అంతర్జాతీయ పరిణామాలు బంగారాన్ని మరింత ఆకర్షణీయ పెట్టుబడిగా మార్చాయి. ఆర్థికపరమైన ఆందోళనలు కూడా బంగారం విలువ పెరగడానికి కారణమైనప్పటికీ, పరిస్థితులు చక్కబడినప్పుడు లేదా లాభాలు చాలని ఇన్వెస్టర్లు భావించినప్పుడు ధరలు అంతే తేలిగ్గా పడిపోవచ్చు.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ముడి చమురు ధర 5 శాతానికి పైగా తగ్గింది.ప్రధాన చమురు ఉత్పత్తి సంస్థలు, యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించడం, అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చన్న సంకేతాలు వంటివి చమురు ధరలు తగ్గడానికి కారణాలుగా భావిస్తున్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
04.02.2026

# గ్రామీణ తెలంగాణ గుండె చప్పుడు: ఫజల్ రహమాన్ జర్నలిస్టిక్ ప్రయాణం

**కొన్ని సందర్భాల్లో ఆయన రాసిన కథనాల వల్ల స్థానిక రాజకీయ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినా, నిజం వైపు నిలబడటమే ఆయన ధోరణి. ఇదే ధైర్యం ఆయనను ప్రజల్లో మరింత విశ్వసనీయుడిగా మార్చింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే జర్నలిస్ట్‌గా ఫజల్ రహమాన్ గుర్తింపు పొందారు. ఫజల్ రహమాన్ జీవిత చివరి దశ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. జర్నలిజం అనేది పదవుల కోసం కాదు, ప్రజల కోసం అన్న సిద్ధాంతాన్ని ఆయన చివరి శ్వాస వరకూ ఆచరించారు. నిజం కోసం నిలబడిన ఒక జర్నలిస్ట్ జీవితం ఇలానే ముగియాలని చెప్పేలా ఆయన చివరి దశ నిలిచింది. ప్రజల గుండెల్లో ఆయన వేసిన ముద్రే ఆయనకు నిజమైన నివాళి.**

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ జర్నలిజం రంగంలో నేలమీద నిలబడి ప్రజల స్వరాన్ని అక్షరాలుగా మలిచిన కొద్దిమంది నిబద్ధత గల పాత్రికేయుల్లో హుస్నాబాద్‌కు చెందిన ఫజల్ రహమాన్ ఒకరు. జర్నలిజాన్ని వృత్తిగా మాత్రమే కాక ప్రజాసేవగా భావించిన ఆయన ప్రయాణం గ్రామీణ తెలంగాణ సామాజిక చరిత్రకు అద్దం పడుతుంది. అధికార కేంద్రాలకు దూరంగా, పల్లె బాటలపై తిరుగుతూ ప్రజల బాధలు, ఆశలు, ఆకాంక్షలను నిక్కచ్చిగా వెలుగులోకి తీసుకువచ్చిన పాత్రికేయుడిగా ఫజల్ రహమాన్ గుర్తింపు పొందారు. తెలంగాణ గ్రామీణ జర్నలిజం చరిత్రలో హుస్నాబాద్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉంటే, ఆ గుర్తింపుకు కారణమైన నిబద్ధత గల పాత్రికేయుల్లో ఫజల్ రహమాన్ పేరు తప్పక వినిపిస్తుంది. జర్నలిజాన్ని వృత్తిగా మాత్రమే కాక సమాజ మార్పుకు సాధనంగా భావించిన వ్యక్తిగా ఆయన జీవితం, ప్రయాణం నిలుస్తాయి. ప్రజల జీవితాల మధ్యే పుట్టి, అదే ప్రజల సమస్యలను అక్షరాలుగా మలిచిన జర్నలిస్టుగా ఫజల్ రహమాన్ తనదైన ముద్ర వేశారు. హుస్నాబాద్ సమీపంలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఫజల్ రహమాన్ జన్మించారు. బాల్యం నుంచే ఆయన జీవితం గ్రామీణ వాతావరణంతో ముడిపడి సాగింది. పొలం పనులు, గ్రామ సభలు, పేదల దైనందిన కష్టాలు ఆయన కళ్ల ముందే పెరిగాయి. కుటుంబంలో క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేయాలనే విలువలు నాటివేయబడ్డాయి. ఇవే ఆయన భవిష్యత్ వ్యక్తిత్వానికి పునాదులయ్యాయి. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి, పుస్తకాలపై ప్రేమ కనిపించేది. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను హుస్నాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేశారు. వార్తాపత్రికలు చదవడం, సమాజంలో జరుగుతున్న సంఘటనలను గమనించడం ఆయనకు అలవాటుగా మారింది. ఉన్నత విద్య దశలో సామాజిక శాస్త్రాలు, రాజకీయ పరిణామాలపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ దశలోనే జర్నలిజం పట్ల ఆకర్షణ కలిగింది. విద్య పూర్తయ్యాక జీవనోపాధి కోసం వివిధ మార్గాలు ఆలోచించినప్పటికీ, చివరకు జర్నలిజాన్నే తన జీవిత మార్గంగా ఎంచుకున్నారు. ప్రారంభ దశలో స్థానిక వార్తా పత్రికలతో అనుసంధానమై గ్రామీణ వార్తల సేకరణ బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సైకిల్ లేదా బస్సుల్లో ప్రయాణిస్తూ వార్తలు సేకరించడం సాధారణమే. రోడ్లు లేని గ్రామాలు, రాత్రివేళల్లో ప్రయాణం, అధికారుల నిర్లక్ష్యం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా ఆయన తన పనిని కొనసాగించారు. ఫజల్ రహమాన్ జర్నలిజంలోకి వచ్చిన కాలం గ్రామీణ తెలంగాణలో మార్పులు మెల్లగా ప్రారంభమవుతున్న దశ. వ్యవసాయ రంగంలో సంక్షోభాలు, వలసలు, నిరుద్యోగం, సాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న కాలం అది. ఈ పరిస్థితులన్నింటినీ ఆయన తన కథనాల్లో ప్రతిబింబించారు. రైతుల ఆత్మహత్యలు, పంట నష్టాలు, ఎరువుల కొరత వంటి అంశాలపై ఆయన

హుస్నాబాద్ తొలితరం జర్నలిస్టులు (ఎడమ నుంచి వరుసగా) అన్నవరం దేవేందర్, కొండ లక్ష్మణ్, కరివేద మల్లారెడ్డి, ఫజుల్‌రహమాన్

రాసిన కథనాలు అప్పట్లో విస్తృత చర్చకు దారి తీశాయి. జర్నలిజంలో ఆయన ప్రత్యేకత ప్రజల దగ్గర ఉండడం. గ్రామాల్లో జరిగే చిన్న సంఘటనను కూడా సామాజిక నేపథ్యంతో అనుసంధానించి రాయడం ఆయన శైలి. సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలు, రేషన్ కార్డుల సమస్యలు, పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై ఆయన నిరంతరం రాశారు. ఉదాహరణకు, ఒక దశలో హుస్నాబాద్ పరిధిలో వందలాది కుటుంబాలకు రేషన్ సరుకులు సకాలంలో అందని పరిస్థితిని ఆయన వరుస కథనాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. వ్యక్తిగత జీవితంలో ఫజల్ రహమాన్ సరళ జీవనం గడిపే వ్యక్తి. కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇస్తూనే, వృత్తి బాధ్యతలను ఎప్పుడూ విస్మరించలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆయన సామాజిక నిబద్ధతను అర్థం చేసుకొని ప్రోత్సహించారు. ఆర్థిక లాభాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇచ్చే స్వభావం ఆయన జీవితాంతం కొనసాగింది. ప్రకటనలు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రలోభాలు వచ్చినా వాటికి లొంగని వ్యక్తిగా ఆయన పేరుగాంచారు. ప్రకృతి విపత్తుల సమయంలో, వరదలు లేదా కరువు పరిస్థితుల్లో బాధితుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాక స్వచ్ఛందంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పేద విద్యార్థుల చదువుకు చేయూత వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. జర్నలిజంలో ఎదురైన ఒత్తిళ్లు, బెదిరింపులు ఆయనను వెనక్కి నెట్టలేకపోయాయి. కొన్ని సందర్భాల్లో ఆయన రాసిన కథనాల వల్ల స్థానిక రాజకీయ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినా, నిజం వైపు నిలబడటమే ఆయన ధోరణి. ఇదే ధైర్యం ఆయనను ప్రజల్లో మరింత విశ్వసనీయుడిగా మార్చింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే జర్నలిస్ట్‌గా ఫజల్ రహమాన్ గుర్తింపు పొందారు. సీనియర్ జర్నలిస్ట్‌గా ఎదిగిన తరువాత కూడా ఆయన నేలమీదే నిలబడ్డారు. కొత్తగా జర్నలిజంలోకి వచ్చే యువతకు మార్గదర్శకుడిగా వ్యవహరించారు. వార్త రాయడంలో బాధ్యత, నిజాయితీ, అధ్యయనం ఎంత అవసరమో తన అనుభవాల ద్వారా వారికి వివరించారు. జర్నలిజం అంటే కేవలం వార్తను ముందుగా చెప్పడం కాదు, సమాజానికి దిశానిర్దేశం చేయడమని ఆయన నమ్మకం. మొత్తంగా ఫజల్ రహమాన్ జీవితం ఒక వ్యక్తి జర్నలిజం ద్వారా సమాజానికి ఎలా ఉపయోగపడగలడో చూపించే ఉదాహరణ. బాల్యం నుంచి ఎదుగుదల వరకు, వ్యక్తిగత జీవితం నుంచి ప్రజా జీవితం వరకు ప్రతి దశలో ఆయన నిజాయితీకి కట్టుబడి ఉన్నారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజల సమస్యలను రాష్ట్ర స్థాయి చర్చకు తీసుకువచ్చిన పాత్రికేయుడిగా, గ్రామీణ జర్నలిజానికి గౌరవాన్ని తీసుకువచ్చిన వ్యక్తిగా ఫజల్ రహమాన్ స్థానం చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన ప్రయాణం రాబోయే తరాలకు జర్నలిజం యొక్క అసలైన అర్థాన్ని గుర్తుచేస్తూనే ఉంటుంది. ఫజల్ రహమాన్ జీవిత చివరి దశ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. జర్నలిజం అనేది పదవుల కోసం కాదు, ప్రజల కోసం అన్న సిద్ధాంతాన్ని ఆయన చివరి శ్వాస వరకూ ఆచరించారు. నిజం కోసం నిలబడిన ఒక జర్నలిస్ట్ జీవితం ఇలానే ముగియాలని చెప్పేలా ఆయన చివరి దశ నిలిచింది. ప్రజల గుండెల్లో ఆయన వేసిన ముద్రే ఆయనకు నిజమైన నివాళి.

**(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)**

# అన్యాయాన్ని ఉపేక్షించడం మానవతకు వ్యతిరేకం

యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ఉత్తరాఖండ్‌లో ఇటీవల చోటు చేసుకున్న, చిన్నదిగా కనిపించే ఒక సంఘటన, వాస్తవానికి భారతీయ సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభాన్ని బయటపెట్టింది. ఇది కేవలం ఒక దుకాణం పేరుకు సంబంధించిన వివాదం కాదు. అది మత ఆధారిత అధికారం, అహంకారం, విద్వేష రాజకీయాల ప్రతిరూపం. ఇంత జరుగుతున్నా మౌనం పాటిస్తున్న సమాజం. ఇలాంటి వాతావరణంలో ఆ మౌనాన్ని ఛేదిస్తూ ఒక సాధారణ పౌరుడు అన్యాయాన్ని ప్రశ్నించిన తెగువ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పౌరి గఢ్వాల్ జిల్లా కోట్ద్వార్ పట్టణంలో, దశాబ్దాలుగా ఒక ముస్లిం వృద్ధుడు నడుపుతున్న చిన్న బట్టల దుకాణం పేరు 'బాబా డ్రెసెస్'. ఆ పేరు అక్కడి ప్రజలకు కొత్తది కాదు. ఏ వివాదం లేని, సాధారణ వ్యాపార గుర్తింపుగా ముప్ఫయ్ ఏళ్ళకు పైగా కొనసాగుతోంది. కానీ అకస్మాత్తుగా, ఆ పేరే ఒక వర్గానికి అభ్యంతరకరంగా మారింది. కారణం, ఆ దుకాణాన్ని నడుపుతున్న వ్యక్తి ఒక ముస్లిం కావడమే. 'బాబా' అనే పదం హిందూ మతానికి, హిందూ సంస్కృతికి మాత్రమే చెందినదని, ముస్లింలకు దాన్ని వాడే హక్కు లేదని వాదిస్తూ, దుకాణం పేరు మార్చాలని బజరంగదళ్ , విశ్వహిందూ పరిషత్ కు చెందిన కొంతమంది గూండాలు దుకాణదారుని బెదిరించారు. వృద్ధునిపై దౌర్జన్యానికి తెగబడ్డారు. నిజానికి పేరు మార్చాలని డిమాండ్ చేయడానికి ఆ మతోన్మాద మూకకు ఏవిధమైన చట్టపరమైన, నైతిక పరమైన హక్కు, అధికారం లేదు. ఇది నేరుగా పౌర హక్కులపై జరిగిన దాడి.

'బాబా' అనే పదం ఏదైనా ఒక మతానికి, లేక ఏదైనా వర్గానికి ప్రత్యేకమైనదా? అన్న ప్రశ్న ఇక్కడ సహజంగా తలెత్తుతుంది. భారతీయ భాష, సంస్కృతిలో, గ్రామీణ వ్యవహారాలలో 'బాబా' అనేది వృద్ధుల గౌరవానికి, ప్రేమకు సూచికగా వాడే పదం. చాలామంది చిన్న పిల్లలను సైతం బాబా అని ప్రేమతో సంబోధిస్తారు. దేశవ్యాప్తంగా వేలాది దుకాణాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, మిఠాయి షాపులు ఈ పేరుతో నడుస్తున్నాయి. కాని ఎక్కడా ఎవ్వరూ యజమాని మతాన్ని అడగరు. కానీ ఇక్కడ మాత్రం, మతమే సమస్యగా మారింది. ఈ దౌర్జన్యకర ఘటనలో అత్యంత ముఖ్యమైన మలుపు ఏమిటంటే, అక్కడే ఉన్న దీపక్ కుమార్ అనే ఒక సాధారణ పౌరుడు ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించాడు. బాబా పేరు పెట్టుకుంటే తప్పేమిటని, అయినా ఇది ఈ రోజు పెట్టిందికాదని, ముప్ఫయి ఏళ్ళకు పైగా ఇదే పేరుతో నడుస్తోందని చెప్పాడు. అనేకమంది ఈ పేరుతో షాపులు నడిపితే తప్పు కానప్పుడు, ఈ వృద్ధుడు బాబా అని పెట్టుకుంటే తప్పెలా అవుతుంది? ఇతను పేరు ఎందుకు మార్చాలి? అని నిలదీశాడు. ఇది చాలా

సాధారణమైన ప్రశ్న. కానీ ఈ రోజుల్లో ప్రశ్నించడం ఒక సాహసమే.

దుకాణ దారుడికి మద్దతుగా మాట్లాడిన దీపక్ కుమార్‌ను 'అసలు నువ్వెవరు? మధ్యలో నీకేంపనీ' అంటూ అతనిపై దౌర్జన్యానికి దిగినప్పుడు, 'నాపేరు ముహమ్మద్ దీపక్ 'ఏంచేసుకుంటారో చేసుకోండి అని ఎదురు తిరిగిన సాహసి దీపక్ కుమార్ . నిజానికి అతను దీపక్ కుమారే, కావాలనే ముహమ్మద్ దీపక్ అని చెప్పాడు. బాబా అని పెట్టుకుంటే మీకొచ్చిన ఇబ్బంది ఏమిటి? అసలు దుకాణం పేరు మార్చుకోవాల్సిన అవసరం ఏమిటి? అనేది ఆయన వాదన. దీపక్ ఏమీ పెద్ద పెద్ద ప్రసంగాలు చేయలేదు. ఎలాంటి రాజకీయ నినాదాలు చేయలేదు. ఎవర్నీ రెచ్చగొట్టలేదు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు. కేవలం మానవతా దృక్పథంతో తన కళ్ళముందు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాడు, ఎదిరించాడు. అది తన కనీస నైతిక బాధ్యతగా భావించాడు. నిలువెల్లా ఉన్మాదం నింపుకున్న రౌడీ మూకకు ఇది నచ్చలేదు. అంతే.. విచిత్రం ఏమిటంటే, అల్లరిమూక గొడవ చేస్తున్నప్పుడు అక్కడ చాలామంది గుమిగూడారు. కాని అందరూ చోద్యం చూశారు తప్ప, 'అయ్యో.. ఇతి తప్పు' అని ఒక్కరూ నోరు మెదపలేదు. అందరూ మౌన మునులైపోయారు. 'మనకెందుకులే' అనుకుని పక్కకు తప్పుకున్నారు. ఈ మౌనమే దౌర్జన్యపరులకు బలం ఇస్తోంది. ఇలాంటి సమయంలో ఈ మౌనాన్ని ఛేదించిన అరుదైన ఉదాహరణగా దీపక్ నిలిచాడు. బజరంగీ అల్లరిమూక సృష్టించిన ఈ భీభత్సం భారత రాజ్యాంగం ఇచ్చిన మౌలిక హక్కులను అపహాస్యం చేసింది. ఒకవ్యక్తి మతం ఆధారంగా వివక్ష చూపకూడదు అన్నది రాజ్యాంగం ఆత్మ. ఏ వ్యాపారమైనా చేసుకోవడం, దానికి ఏపేరైనా పెట్టుకోవడం, స్వేచ్ఛగా జీవించడం ఇవన్నీ పౌరుల హక్కులు. వీరిపై కాషాయ గుంపులు అధికారం చెలాయించడానికి ఎలాంటి నైతిక, చట్టబద్ధమైన ఆధారం, అధికారం లేదు.

మరింత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, ఇలాంటి ఘటనలు ఇటీవలి కాలంలో సాధారణమైపోతున్నాయి. ఒక మతానికి చెందిన వ్యక్తి ఏ పేరు పెట్టుకోవాలి, ఏ దుస్తులు ధరించాలి, ఏ భాష మాట్లాడాలి, ఎలాంటి ఆహారం భుజించాలి అన్నది కూడా ఈ మతోన్మాద శక్తులే నియంత్రించే స్థాయికి పరిస్థితులు దిగజారిపోయ్యాయి. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం. భారతదేశం గర్వపడే బహుళత్వ సంస్కృతికి ఇది గొడ్డలిపెట్టు. దీపక్ కుమార్‌పై ఆ తరువాత వచ్చిన ఒత్తిళ్లు, విమర్శలు, బెదిరింపులు, కేసులు మరో నిజాన్ని బయటపెట్టాయి. న్యాయంగా మాట్లాడినవారిని సమాజం ఒంటరిగా వదిలేసినా, అదే సమయంలో, ఆయన గుండె ధైర్యం, న్యాయ తత్పరత వేలాది మందికి స్ఫూర్తినిచ్చింది. వారిలో ఆలోచనలను రేకెత్తించింది. తప్పు జరుగుతున్నప్పుడు, కళ్ళముందే అమాయకులు దౌర్జన్యానికి గురౌతున్నప్పుడు మౌనంగా ఉండడం మానవత్వానికి వ్యతిరేకమన్న సందేశాన్ని సమాజానికి అందించింది. ఈ సంఘటనలో ఒక స్పష్టమైన పాఠం ఉంది. మతం పేరుతో భయపెట్టే రాజకీయాలు ఎంత బలంగా ఉన్నా, నిబద్ధత కలిగిన ఒక పౌరుని స్వరం వాటిని ప్రశ్నించగలదు, ఎదిరించగలదు. ఒక వృద్ధుణ్ని దుకాణం పేరు సాకుతో వేధించిన ఈ ఒక్క సంఘటనే కాకుండా, కులం పేరుతో, మతం పేరుతో, దేవుడి పేరుతో లేక మరేవిధంగానైనా ఎక్కడ ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఆ దుర్మార్గానికి వ్యతిరేకంగా, ప్రతి ఒక్కరూ స్పందించగలగాలి. ప్రశ్నించగలగాలి. కనీసం 'ఇది అన్యాయం' అనైనా నోరువిప్పి మాట్లాడగలగాలి. అదే నిజమైన దేశభక్తి. దేశం అంటే గుంపుస్వామ్యం కాదు. దేశం అంటే మతస్వామ్యం కాదు. గురజాడ అన్నట్లు దేశమంటే మనుషులు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ భయరహితంగా బతికే హక్కు కలిగిన పౌరులు. కోట్ద్వార్‌లో జరిగిన ఈ సంఘటన మనకు చెబుతున్నదిదే. ఎవరికి వారు మనకెందుకులే అని మౌనం వహిస్తే దౌర్జన్యాలు పెరిగిపోతాయి. ప్రశ్నిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది. మానవత్వం నిలబడుతుంది.

**(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)**

# మాయాలోకపు మత్తులో.. భావి భారతం

డా. పూసపాటి వేదాద్రి
9912197694

''నేటి బాలలే రేపటి పౌరులు'' అన్న మాట నేడు కేవలం నినాదంగా మిగిలిపోతోందా అన్న అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు పలకబలపంతో అక్షర సేద్యం చేసిన చిట్టి చేతులు, నేడు స్మార్ట్‌ఫోన్ల మాయాలోకంలో చిక్కుకుంటున్నాయి. విజ్ఞానాన్ని పంచాల్సిన వయసులో వ్యసనాల ఊబిలో కూరుకుపోతున్న బాల్యం, దేశ భవిష్యత్తుకు ఒక హెచ్చరికగా మారుతోంది.గతంలో బాల్యం అంటే మైదానాల్లో ఆటలు, అమ్మమ్మల కథలు, పుస్తకాలతో స్నేహం. కానీ నేడు పుస్తకాలకు బదులుగా గంటల తరబడి సెల్‌ఫోన్ స్క్రీన్‌లపై గడపడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత నశిస్తోంది.ఎదుటివారితో నేరుగా మాట్లాడటం తగ్గిపోయింది. నోటిఫికేషన్ల శబ్దం మధ్య మౌనంగా మారిపోతున్న బాల్యం ఆందోళనకరం.నిజమైన ప్రపంచం కంటే వర్చువల్ (కృత్రిమ) ప్రపంచమే గొప్పదనే భ్రమలో పిల్లలు బతుకుతున్నారు.మరింత విచారకరమైన విషయం ఏమిటంటే, ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి ప్రాణాంతక వ్యసనాలకు బానిసలవుతున్నారు. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌ల రూపంలో విద్యార్థులకు తెలియకుండానే మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నాయి.పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకనో లేదా సరదా కోసమో మొదలుపెట్టి, చివరకు తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు.విద్యా వ్యవస్థ దెబ్బతింటోంది, సమాజ భద్రత ప్రశ్నార్థకమవుతోంది. ఈ విపత్కర పరిస్థితులను అరికట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబర్ 2024లో'ఈగల్ EAGLE (Elite AntiNarcotics Group for Law Enforcement) అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈగల్ వ్యవస్థ ఉద్దేశ్యం గంజాయి సాగు నుంచి ప్రారంభమై మాదకద్రవ్యాల రవాణా, సరఫరా, వినియోగం వరకు ప్రతి దశను కఠినంగా నియంత్రించడం ఈగల్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. కేవలం నేరాలను అణచివేయడం మాత్రమే కాకుండా, మత్తు పదార్థాల మూలాలను గుర్తించి సమాజాన్ని మత్తు రహితంగా మార్చడం దీని ఆశయం. నిర్మాణం మరియు నిర్వహణ ఈగల్ వ్యవస్థను క్రమబద్ధమైన పరిపాలనా నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.రాష్ట్రస్థాయి కేంద్రం అమరావతిలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసి, మొత్తం రాష్ట్ర కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు. జిల్లా స్థాయి యూనిట్లు ప్రతి జిల్లాలో ప్రత్యేక నార్కోటిక్ పోలీస్ స్టేషన్లు, కంట్రోల్ సెల్స్ ఏర్పాటు చేసి, స్థానికంగా డ్రగ్స్ కార్యకలాపాలపై నిఘా పెంచారు. విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లుమాదకద్రవ్యాల నియంత్రణ పోలీసు చర్యలతో మాత్రమే సాధ్యం కాదని గ్రహించిన ప్రభుత్వం, విద్యార్థులను ఈ ఉద్యమంలో భాగస్వాములుగా మార్చింది. 2025 ఫిబ్రవరి నుండి పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ప్రారంభించబడ్డాయి.ప్రజలు మరియు బాధితులు సమాచారం అందించేందుకు ప్రభుత్వం 1972 అనే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది 24/7 అందుబాటులో ఉంటుంది. అమరావతిలోని కాల్ సెంటర్ నుండి 12 మంది సిబ్బంది దీనిని పర్యవేక్షిస్తారు. డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల గురించి సమాచారం ఇచ్చేవారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతారు. EAGLE (Elite AntiNarcotics Group) ను ప్రారంభించడం ఒక గొప్ప ముందడుగు.పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించడం.విద్యా సంస్థల పరిసరాల్లో అసాంఘిక శక్తులపై నిఘా ఉంచడం. ఇటువంటి వినూత్న కార్యక్రమాలు కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశమంతటా అమలు కావాలి. పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారితో నాణ్యమైన సమయాన్ని గడపాలి. కేవలం పాఠాలే కాకుండా నైతిక విలువలను, వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను బోధించాలి.మత్తు పదార్థాల విక్రయాల వంటి అంశాలను గమనించినప్పుడు బాధ్యతగా అధికారులకు సమాచారం అందించాలి.బాల్యం అనేది ఒక స్వచ్ఛమైన సెలయేరు. అది పుస్తకాల జ్ఞానంతో వికసించాలి కానీ, మత్తు పదార్థాల మత్తులో మురిగిపోకూడదు. భావి భారత పౌరులు వ్యసనాల బారి నుండి బయటపడి, కలలను సాకారం చేసుకున్నప్పుడే మన దేశం సుభిక్షంగా ఉంటుంది. మనందరం ప్రతిజ్ఞ చేద్దాం ''వ్యసనాలను తరిమికొడదాం, విజ్ఞానవంతులైన పౌరులను తీర్చిదిద్దుదాం''.

**(రచయిత సామాజిక విశ్లేషకులు)**

## రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

## రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

# మా ప్లాట్ల సమస్యను పరిష్కరించండి

- ఎమ్మెల్సీకి బాధితుల విన్నపం

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 3 :** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటిలోని పెద్ద చెరువు లో ప్లాట్లు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి ని బాధితులు కోరారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు వద్ద బాధితులు ఆయన ను కలిసి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేండ్ల కిందట పైస, పైస కూడ బెట్టి ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తే అధికారులు చెరువు తూము విడవక చెరువు నిండి తమ పాట్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పై అధికారులకు విన్నవించిన పరిష్కరించడం లేదన్నారు. అమీన్ పూర్ పెద్ద చెరువులో తమ ప్లాట్లు కోల్పోయామని, ఎఫ్ టి ఎల్ పెరగడంతో తమ పాట్లు పూర్తిగా మునిగిపోయాయని బాధితులు వాపోయారు.

**భూమికి భూమి ఇవ్వండి**

చెరువు ఎఫ్ టి ఎల్ ప్లాట్లు కోల్పోయిన బాధితులకు భూమికి భూమి ఇవ్వాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ స్థానిక అధికారులతో ఫోన్ లో మాట్లాడాడు చెరువు స్థలంపై మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రీ సర్వే చేసి, హద్దులను గుర్తించాలన్నారు.బాధితులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నామమాత్రపు టి డి ఆర్ ఇస్తే ఊరుకునే పరిస్థితి లేదని మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి సంతోష్‌కుమార్
- వరల్డ్ క్యాన్సర్ డే సంధర్బంగా ప్రభుత్వాసుపత్రిలో అవగహన కార్యక్రమం

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 3:** క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సంతోష్‌కుమార్ అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌లో 200 రకాలు ఉంటాయని తెలిపారు. క్యాన్సర్ వచ్చినపుడు మనిషి మానసికంగా, ధృడంగా ఉన్నప్పుడే వ్యాధిని జయించవచ్చు అన్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ చిన్న నొప్పి ఉన్నా నిర్లక్ష్యం చేయకూడదని, మహిళలు ముందు వారి ఆరోగ్య పరిస్థితిని గమనించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బావుంటుందన్నారు. గుట్కా, సిగరెట్టు, తంబాకు, వాడే వారికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆసుపత్రిలో పెషేంట్లకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సంగీత, డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ చందర్, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సదానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి

**ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 3:** అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన కోమాకుల కిషన్ గెలిపిస్తేనే వార్డు అభివృద్ధి జరుగుతుందని 44 వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి కిషన్ తెలిపారు. బుధవారం ఆయన ఇంటింట తిరుగుతూ తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తనను ఓటు వేసి రానున్న 11వ తేదీ న చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే సహకారంతో 44 వ వార్డుకు అవసరమైన నిధులను కేటాయించి వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్ల సత్యనారాయణ, బాపు భీమయ్య లతోపాటు వార్డు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

# ర్యాలీలు, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 3:** మున్సిపల్ ఎన్నికలు-2026 నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేసి, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ లేదా బహిరంగ సభ నిర్వహించాలంటే తప్పనిసరిగా సంబంధిత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రచారానికి వినియోగించే వాహనాలకు కూడా సంబంధిత ఏసీపీకి దరఖాస్తు సమర్పించి అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు.ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు లేదా సమావేశాలు నిర్వహించినట్లయితే, ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ చర్యలు ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటంతో పాటు, స్వేచ్ఛాయుత మరియు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడడానికే ఉద్దేశించబడినవని తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు,వారి మద్దతుదారులు ఎన్నికల నియమాలు, చట్టాలను గౌరవించి, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# బీఆర్ఎస్ కు ఓటు.. ముంపు గ్రామాలకు చేటు

- సమిష్టిగా కృషి చేసి పార్టీ ప్రతిష్టతను నిలుపుదాం
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట

**ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 3:** మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా శ్రమిద్దామని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అభ్యర్థులకు మద్దతుగా మున్సిపల్ వివిధ వార్డులో ఆయన ప్రచారం చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జరగనున్న ఎన్నికల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వగా, గ్రూపులకతీతంగా కష్టించి పని చేద్దామని స్పష్టం చేశారు. కులాలు, మతాలకు అతీతంగా అభ్యర్థులను బరిలో దింపగా, 20 వార్డుల్లో స్థానిక అంశాలపై అవగాహన ఉన్న వారికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గజ్వేల్ అభివృద్ధికి అవసరమైన నిధులను సీఎం రేవంత్ రెడ్డి మంజూరి చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. అంతేగాకుండా గత రెండేళ్లుగా కెసిఆర్ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటున్నట్లు విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, సర్వం కోల్పోయిన ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, రేషన్ కార్డులు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ప్రచారంలో బీఎస్పీ అభ్యర్థి దూకుడు

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 3 :** గతంలో చేసిన అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని తనకు భారత రాష్ట్ర సమితి మోసం చేసిందని వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న తనను కాదని కేవలం పార్టీకి ఎలాంటి పరిచయం లేని వ్యక్తికి సభ్యత్వం లేని వ్యక్తికి టికెట్ ఇవ్వడం జరిగిందని కావున గతంలో చేసిన అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకొని తనను గెలిపించాలని బిఎస్పి 19వ వార్డు అభ్యర్థి వంజరి జయరాజ్ తెలిపారు మంగళవారం 19వ వార్డులో విస్తృతంగా పర్యటించారు ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని గతంలో తను అభివృద్ధి చేయడం జరిగిందని తిరిగి బీఎస్పీ అభ్యర్థిగా ముందుకు వస్తున్నానని చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలని తను రాజకీయ ప్రజాసేవకునని ఆయన తెలిపారు.19 వ వార్డులో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా పర్యటనకు హాజరు కానున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని సీ.ఎం సభా స్థలిగా ఖరారు చేసిన నేపథ్యంలో కలెక్టర్ , సీ.పీ క్షేత్రస్థాయిలో ఆ ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హెలిప్యాడ్, వేదిక తదితర వాటి ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీ.ఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్ బీ ఎస్.ఈ సర్దార్ సింగ్, ట్రాన్స్కో ఎస్.ఈ రాజేశ్వర్, ఆర్టీసీ ఆర్.ఎం జ్యోత్స్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 3 :-** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లి, ఔరంగాబాద్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్న భద్రతా ఏర్పాట్లపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ గారు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదనపు ఎస్పీ వెంట మెదక్ రూరల్ ఎసై లింగం, హవెలిఘనపూర్ ఎసై సత్యనారాయణ, ఏఎసై విట్టల్, సిబ్బంది ఉన్నారు.

# గాజులపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రింటర్ అందజేత

**ప్రతిపక్షం,దౌల్తాబాద్, ఫిబ్రవరి 3:** గాజులపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దాసరి కనకయ్య ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా కార్యక్రమాలకు ఈ ప్రింటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందించిన దాసరి కనకయ్యను పాఠశాల ఉపాధ్యాయులు త్యాగరాజు, నవీన్ రెడ్డి,నర్సింహులు, రజిత,జ్యోతి రోజా,సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి ట్యాబ్ అంజేసిన మాజీ ఎంపీపీ

**ప్రతిపక్షం, నంగునూరు, ఫిబ్రవరి 3:** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం మైసంపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ అనే విద్యార్థి ఉన్నత చదువుల్లో అవసరమైన ట్యాబ్ ను నంగునూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు జాప శ్రీకాంత్ రెడ్డి సమకూర్చారు. సాయికుమార్ తన ఉన్నత చదువులు చదవడానికి అవసరమైన ట్యాబ్ కొనుక్కునేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు జాప శ్రీకాంత్ రెడ్డి దృష్టికి మైసంపల్లి గ్రామానికి చెందిన 5 వ వార్డు సభ్యుడు తేలు రఘు తీసుకెళ్లారు. స్పందించిన జాప శ్రీకాంత్ రెడ్డి శాంసంగ్ ట్యాబ్ ను మంగళవారం సాయి కుమార్ కు అందించారు. విద్యార్థి విద్యాభివృద్ధికి తోడ్పడడానికి తన వ్యక్తిగత ఖర్చుతో ట్యాబ్ ను సమకూర్చి అందజేసిన జాప శ్రీకాంత్ రెడ్డికి విద్యార్థి సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రారంభానికి నోచుకోని బాల రక్ష భవన్

- పిల్లల పరిరక్షణకు ఆటంకంగా జాప్యం

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 3:** తెలంగాణలో బాలల రక్షణ, సంరక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2022లో సిద్దిపేట లో నిర్మించిన బాల రక్ష భవన్ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఈ భవనం ద్వారా ఒకే చోట బాలల పరిరక్షణ విభాగం,చైల్డ్ హెల్ప్ లైన్ - 1098,బాలల సంక్షేమ సమితి (CWC)తో పాటు మొత్తం ఏడు కీలక విభాగాలు పనిచేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ విభాగాలు విడివిడిగా వేర్వేరు చోట్ల పనిచేస్తుండటంతో బాలలు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒక సమస్యకు సంబంధించి ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సి రావడం వల్ల బాలల రక్షణ, సంరక్షణలో ఆలస్యం జరుగుతోందని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇది ప్రమాదకరంగా మారుతోందని వారు పేర్కొంటున్నారు.ఇంత కీలకమైన భవనం నిర్మాణం పూర్తై మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభించకపోవడం వెనుక కారణాలు ఏమిటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని ప్రజలు విమర్శిస్తున్నారు.అన్ని విభాగాలు ఒకే చోట పనిచేస్తేనే బాలలకు తక్షణ సహాయం, రక్షణ సాధ్యమవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బాల రక్ష భవన్‌ను ప్రారంభించి బాలలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాలకు తావు లేదు

- ఎన్నికల సంఘం నియమాలను అనుసరించే గుర్తుల కేటాయింపు
- ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 3 :-** మున్సిపల్ ఎన్నికల్లో వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావాలకు తావు లేదని మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకు రవి కిరణ్ అన్నారు.మంగళవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవోలు ,మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. వెస్లీ కళాశాల లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లను పరిశీలించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, ఎన్నిక జరగాలని, ఎవరైనా బలవంతంగా ప్రలోభాలు చేసిన, బెదిరించిన, చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. ఎన్నికల సంఘం నియమాలను అనుసరించే గుర్తుల కేటాయింపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ ఎన్నికలలో 112 బరిలో మంది అభ్యర్థులు**

మెదక్ మున్సిపల్ పరిధిలోని 32 వార్డులలో 112 మంది బరిలో ఉన్నారు. అందులో కాంగ్రెస్ 31, బీజేపీ 27, బీఎస్పీ 6, బీఆర్ఎస్ 31, ఎంఐఎం 5, ఇండిపెండెంట్ 12 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 32 వ వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థి ఒకరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హైదరాబాద్‌కి దీటుగా సినీ పరిశ్రమకు కేంద్ర బిందువుగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పనిచేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో చర్చించి త్వరలోనే నంది అవార్డులు, నాటక ఉత్సవాలను నిర్వహిస్తాం. సినీ పరిశ్రమపై ఏప్రిల్‌లో కీలక నిర్ణయాలు తీసుకోనున్నాం.

- ఏపీ మంత్రి కందుల దుర్గేశ్

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- **ఎన్నికల సాధారణ పరిశీలకులు జి జితేందర్ రెడ్డి**



**ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 3:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జితేందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్న విధానాన్ని మైక్రో అబ్జర్వర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. పోలింగ్ బూత్ లోపల, బయట నిరంతరం పరిశీలించాలని తెలిపారు. విధుల నిర్వహణలో తప్పకుండా గుర్తింపు కార్డు ధరించాలని అన్నారు. పోలింగ్ ముందు రోజు మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మాక్ పోలింగ్, ఓటింగ్, పోలింగ్ ఏజెంట్ల నియామకం వంటివి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటింగ్ సరళిని తెలియజేయాలని, పరిస్థితులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఆడిట్ అబ్జర్వర్ ఎం.మనోహర్, నోడల్ అధికారి, జెడ్పి సీఈఓ శ్రీనివాస్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహినుద్దీన్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

# జిల్లా సంక్షేమ శాఖ అధికారి జెట్టి జయంతి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

**ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 3:** జిల్లా పరిషత్ ఆవరణలోని వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, వరంగల్ జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రిటైర్డ్ డిఎస్పి దామర నరసయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జెట్టి జయంతి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమానికి ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ జెడ్పి హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆమె సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాడుగల నరసయ్య, మల్లం రాజకుమార్, పరమళ్ళ కృష్ణస్వామి (అడ్వకేట్) పాల్గొని జెట్టి జయంతి గారిని శాలువాతో ఘనంగా సత్కరించి, పదవీ విరమణ అనంతర జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# 43 డివిజన్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- **కార్పొరేటర్ అభ్యర్థి చిలువేరు జ్యోతి**

**ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 23:** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 43 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి చిలువేరు జ్యోతి వార్డులో బుధవారం ప్రచారాన్ని నిర్వహిస్తూ తమ గెలుపు ఖాయమని అన్నారు ఈనెల 11న జరిగే పోలింగ్ తేదీన చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని గెలుపు దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు తనకు ఓటు వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నట్టుగా తెలిపారు ఇప్పటికే తన గెలుపు ఖాయం అన్నట్టుగా భావిస్తున్నానని అన్నారు ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు ఎమ్మెల్యే సహకారంతో వాడును అభివృద్ధి పథంలో నలుపుతానని తెలిపారు.

# 43వ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా

**ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 23:** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 43వ డివిజన్లు అభివృద్ధి పథంలో నడుపుతానని వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాదె రమాదేవి తెలిపారు. బుధవారం 43 వ వార్డులో సుడిగాలిలా తిరుగుతూ తన ప్రచారాన్ని ఉమ్మరం చేశారు. గతంలో వార్డు కౌన్సిలర్ చేసిన అనుభవం తమ కుటుంబానికి ఉందని అన్నారు. వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. నిత్యం డివిజన్ అభివృద్ధి తన లక్ష్యంగా స్వీకరిస్తారు అన్నారు తనను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# 44వ డివిజన్లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

**ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 3:** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల 44వ డివిజన్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అంకం నరేష్ బుధవారం ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వార్డు ప్రజలతో తనకు అనేక సంవత్సరాల పరిచర్య ఉన్నాయని గతంలో ఒక పర్యాయం కౌన్సిలర్ గా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. వార్డులో ఉన్న సమస్యలు తనకు తెలుసా అని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే రోడ్లు డ్రైనేజీలు విద్యుత్తు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని పరిష్కరించడం జరిగిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

పాలు లేకుండా కల్తీ నెయ్యి తయారు చేసేలా రూల్స్ మార్చి వైసీపీ బరి తెగించింది. టీటీడీ నెయ్యి కల్తీ జరిగింది కానీ జంతు కొవ్వు కలవలేదని వైసీపీ అంటోంది. అంటే కల్తీ జరిగిందని ఒప్పుకున్నట్లే కదా? కల్తీ అయిందని జగన్ హయాంలో సీఎఫ్ టీఆర్ఐ తేల్చినా పట్టించుకోలేదు. భోలేబాబా డెయిరీని తెచ్చిన ఆలీబాబా ఎవరో తేలాలి. సీఎంగా జగన్ అన్యమతస్థులను టీటీడీలో నియమించారు.

- ఏపీ మంత్రి సత్యకుమార్

# అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 3 :** అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం, సంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తున్న ప్రాణాంతక వ్యాధిగా మారిందని తెలిపారు. అయితే కేన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి సరైన వైద్య చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా మహిళలు మరియు యువత ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మరియు అధ్యాపకులు కేన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలు మరియు ప్రారంభ దశలో గుర్తింపు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్రెస్ట్ కేన్సర్ మరియు సర్వికల్ కేన్సర్ పై ప్రత్యేక అవగాహన కల్పించి, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే యువతలో పెరుగుతున్న మౌత్ కేన్సర్, లంగ్ కేన్సర్ వంటి వ్యాధులకు ధూమపానం మరియు పొగాకు వాడకం ప్రధాన కారణమని తెలిపారు. కేన్సర్ వ్యాధి నివారణలో ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం మరియు మానసిక ఒత్తిడి నియంత్రణ ఎంతో అవసరమని నిపుణులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్సా సౌకర్యాల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. కేన్సర్ వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు మరియు భయాలను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు పోస్టర్లు మరియు సమాచార పత్రాలు పంపిణీ చేయబడింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు మరియు సమాజానికి కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు కేన్సర్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, న్యాయ అవగాహన మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ ముందుంటుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుసుమ కుమారికి పీహెచ్‌డీ

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 3 :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆర్గనైజేషనల్ డెవలప్ మెంట్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ (ఓడీ అండ్ హెచ్ఆర్) విభాగం పరిశోధక విద్యార్థిని సీహెచ్. వీ.ఎల్.ఎల్. కుసుమ కుమారి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'విశాఖపట్నంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఉద్యోగుల పని జీవిత సమతుల్యత'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఓడీ అండ్ హెచ్ఆర్) విభాగం పూర్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సుమన్ బాబు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కుసుమ కుమారి అధ్యయనం, సంస్థాగత పరిస్థితులు, జనాభా అంశాలు, రిమోట్ వర్క్ వంటి అభివృద్ధి చెందుతున్న పని పద్ధతుల ద్వారా ప్రభావితమైన విస్తృతమైన నిర్మాణంగా పనిజీవిత సమతుల్యతను పరిశీలిస్తుందని తెలిపారు. పది కంపెనీలలోని 372 మంది ఐటీ నిపుణుల నుంచి సేకరించిన డేటా ఆధారంగా, ఉద్యోగ సంతృప్తి, ఉత్పాదకతపై పనిజీవిత సమతుల్యత ప్రభావాన్ని నిర్ధారించడానికి బలమైన గణాంక సాధనాలను ఉపయోగించినట్టు వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ఐటీ సంస్థలకు మానసిక శ్రేయస్సు, సుస్థిరమైన పని పద్ధతులు సంస్థాగత సామర్థ్యాన్ని ప్రోత్సహించే ఉద్యోగికేంద్రీకృత విధానాలను రూపొందించడంలో సహాయపడతాయని భావిస్తున్నామన్నారు. డాక్టర్ కుసుమ కుమారి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డా.. నమ్మించి గొంతు కోశారు

- **ఏండ్ల నుండి పార్టీ కోసం పనిచేస్తున్నా**
- **లక్షల రూపాయలు సొంత డబ్బు ఖర్చు పెట్టుకున్నా**
- **నిన్న మొన్న చేరిన వారికి టికెట్ ఇస్తారా..?**
- **నిజమైన కాంగ్రెస్ వాదులకు అన్యాయం**
- **సురంగల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట రెడ్డి ఆవేదన.**



**ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 3 :** పార్టీని నమ్ముకుని పనిచేసిన తనకు తీవ్ర అన్యాయం జరిగిందని సురంగల్ కాంగ్రెస్ నాయకుడు వెంకట రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీ బలోపేతం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి, చిన్న కార్యక్రమం నుంచి పెద్ద ఉద్యమం వరకు ముందుండి నడిపించినా, టికెట్ విషయంలో తన కష్టాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారిని పక్కనబెట్టి, నిన్న మొన్న చేరిన వారికి టికెట్లు ఇవ్వడం బాధాకరమని అన్నారు. ఇది కేవలం తనకే కాదు... పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలకు జరిగిన అన్యాయమని స్పష్టం చేశారు. టికెట్ పంపకాలలో నిబద్ధత, త్యాగం, ప్రజాసేవకు విలువ లేకుండా పోయిందని, అవకాశవాద రాజకీయాలకు కాంగ్రెస్ లో చోటిచ్చినట్లుగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. ఇలాంటి నిర్ణయాలు పార్టీని బలహీనపరుస్తాయని హెచ్చరించారు. నిజమైన కాంగ్రెస్ వాదుల కష్టాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం స్పందించి, నిబద్ధతతో పనిచేసిన నాయకులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ లో అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందని గడ్డం వెంకట రెడ్డి హెచ్చరించారు.

**స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న : గడ్డం వెంకట్ రెడ్డి.**

పార్టీ టికెట్ ఇవ్వకపోయినా తాను వెనకడుగు వేయనని గడ్డం వెంకట్ రెడ్డి అన్నారు. నన్ను నమ్మి ఉన్న నా అనుచరులు , నా అభిమానులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతా. నేను గ్రామానికి చేసిన మంచి పనులే నన్ను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పరకాల రెండో వార్డులో సీపీఎం ప్రచారం

**ప్రతిపక్షం ప్రతినిధి , హనుమకొండ, ఫిబ్రవరి 3 :** పరకాల పట్టణంలో సీపీఎం పార్టీ అభ్యర్థి బొచ్చు విజయ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ రెండో వార్డు అభివృద్ధి లక్ష్యంగా సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రతి గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలు పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొచ్చు రాజు, మడికొండ ప్రశాంత్, బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, చుక్క శాంతి కుమార్, మహిళలు తదితర సీపీఎం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆకస్మిక తనిఖీ**

**ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 3:** పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రగతిలో మరింత మెరుగ్గా ఉండేవిధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యా బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లక్ పల్లి లోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతిని కలెక్టర్ సందర్శించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధన గురించి కలెక్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ ల గురించి ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిని కలెక్టర్ అడిగారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అక్కడే ఉన్న డీఈవో ఎల్ వి గిరిరాజ్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతులను నిర్వహిస్తున్నతరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు మెనూ ఏంటి, ఏం వండారు, ఎంతమంది విద్యార్థులకు వంట చేశారు అని మధ్యాహ్న భోజనం వండిన నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. అదేవిధంగా ఇదే మండలంలోని నారాయణగిరి లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు, బాలుర సెక్షన్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. బాలికల తరగతిలో నేచురల్ రిసోర్సెస్(సహజ వనరులు) అనే పాఠ్యాంశ బోధన సాగుతుండగా విద్యార్థినులను పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చేత పాఠ్యాంశాన్ని చదివించారు. విద్యార్థినులకు అప్పటికప్పుడే నేచురల్ రిసోర్సెస్ ఏంటి అనే ప్రశ్నకు జవాబులు రాయాలని చెప్పగా విద్యార్థినిలు సమాధానాలు రాశారు. విద్యార్థినులు రాసిన సమాధానాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పదో తరగతి బాలుర సెక్షన్ ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ డాక్టర్ బి. రాంధన్, ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలు, విద్యార్థుల ప్రగతి సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఏ విధంగా రివిజన్ చేయిస్తున్నారని ఉపాధ్యాయులను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు బాగుండటంతో పాటు , పదో తరగతి బాలికలు విద్యా ప్రగతి పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను చదువులో మరింత మెరుగుపరచాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల పునశ్చరణ (రివిజన్) చేయించాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో గిరిరాజ్ గౌడ్, ఎంఈవో డాక్టర్ బి .రాంధన్ , తహసిల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపీడీవో కమటం అనిల్ కుమార్, మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత, పుట్ట రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

# విద్యార్థి దశలో కష్టపడితే... జీవితమంతా సుఖ సంతోషాలే

- చదువును ఆయుధంగా మల్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 3 :** విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. పది పరీక్షల్లో ప్రతిభను చాటితే బిగ్ స్క్రీన్ పై టి.20 వరల్డ్ కప్ లైవ్ మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేయిస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా కాకుండా విద్యార్థులకు పునఃశ్చరణ జరిపించాలని ఉపాధ్యాయులకు, సంక్షేమ వసతి గృహాల నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునేందుకు వీలుగా అనువైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న, వసతి గృహాల నిర్వాహకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 3 :** ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇంటర్ విద్యాధికారులకు సూచించారు. మంగళవారం కూల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ను పరిశీలించారు. ల్యాబ్ రూముల్ని, ల్యాబ్ మెటీరియల్ పరిశీలించి, ప్రాక్టికల్స్ ఏ విధంగా జరుగుతున్నాయి అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల రికార్డులను,సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా చేసుకొని, ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు స్పెషల్ క్లాసులు అటెండ్ కావాలన్నారు. ఈ నెల 10 వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి మాధవి, చీప్ సూపర్డెంట్ నవీన్, కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగేలా చూడాలి

- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

**ప్రతిపక్షం, గజ్వేల్ (జగదేవ్ పూర్) ఫిబ్రవరి 3:** మండలాలలోని ఆయా గ్రామాల్లోని గర్భస్థ మహిళల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడుపర్యవేక్షణ చేస్తూ, ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకోవాలని, ఒక్క మహిళ కూడా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లకుండా పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్ మరియు ఏ ఎన్ ఎం లను సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. మంగళవారం మార్కుక్ మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య పరికరాలు మందులు సమకూర్చుకుని రోగులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయవేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో సదుపాయాలు కల్పించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డాక్టర్ మరియు సిబ్బంది పైన చర్యలు తీసుకోవాల్సిందిగా డి ఎం అండ్ ఎచ్ ఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

# నట్టల నివారణ మందులు పంపిణీ

**ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 3:** ఇందుప్రియల్ గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందులను పశు వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ వీరమ్మ స్వామి స్వాతి, హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ. రైతులు ఉచిత పశువైద్య శిబిరాలు గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా తిప్పికొడతాం

- 14వ వార్డులోని ప్రజలకు బిఆరెస్ చేసిన దొఖా కార్డు పంపిణీ
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, కౌన్సిలర్లు సాకి ఆనంద్ ఆలకుంట మహేందర్

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 3:** రాష్ట్ర ప్రజలు నమ్మి పది సంవత్సరాలు అధికారము ఇస్తే ప్రజలను బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కుటుంబం దోఖా చేసింది అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టం అధ్యక్షుడు అత్తుఇమామ్, కౌన్సిలర్లు సాకి ఆనంద్ ఆలకుంట మహేందర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఎన్నికల్లో హామీలు ఇచ్చి పథకాలను అమలుచేయకుండా పదేండ్లు మోసం చేసింది అంటూ సిద్దిపేట పట్టణంలో 14వ వార్డులో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ దొఖా కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సాధ్యం కానీ హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగ భృతి, రేషన్ కార్డు, దళిత బంధు, ఉద్యోగాలు, దళితులకు 3 ఎకరాలు, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తాము అని చెప్పి మాట తప్పారని గుర్తు చేశారు. ఇప్పుడేమో దొంగే దొంగ అని అరిచినట్లుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారు అని అన్నారు. అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అవ్వగానే కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ బీఆర్ఎస్ రాజకీయ ఉనికి కాపాడుకునేందుకు డ్రామాలు చేస్తుంది అని అన్నారు. మీరు ఎన్ని డ్రామాలు చేసిన బీఆర్ఎస్ పార్టీని కెసిఆర్ కుటుంబాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరు అని అన్నారు. సిద్దిపేటలో జరిగిన అవినీతిపై నా దగ్గర ఆధారాలు ఉన్నాయి అని దమ్ము ఉంటే జరిగిన అవినీతి మీద చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. మునిసిపల్ ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్ని డ్రామాలు చేసిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకే మద్దతు పలుకుతున్నారు అని అన్నారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండాయే అని అన్నారు. ఈ కార్యక్రమంలో తప్పెట శంకర్ గ్యాదారి మధు గయాజుద్దీన్ పయ్యావుల సందీప్ యాదవ్ హర్షద హుస్సేన్. రషద్ వహాబ్ విజయడేనియల్ శ్రీకాంత్ వల్లెపు పవన్ నాజ్జా శశి సాయి ప్రతాప్ సనా రజిని .ఫయాజ్. ముదసిర్ రఘు. చందు. తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

- మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి

**ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 3:** త్వరలో జరగబోయే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించి, గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎన్.సీ. రాజమౌళి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు (ఎర్రవల్లి,సింగారం) లో జరిగిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి ఎన్.సీ. సంతోష్ కుమార్ కు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ముఖ్యంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రాజమౌళి గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో నాణ్యమైన సీసీ రోడ్లు, ఇంటింటికి నల్లా కనెక్షన్, విద్యుత్ దీపాలు, గజ్వేల్ రింగ్ రోడ్, మోడ్రన్ బస్టాండ్. విద్యార్థులకు మెరుగైన విద్య కోసం ఎడ్యుకేషనల్ హబ్, మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, కెసిఆర్ కిట్, బీసీ బంధు. మహతి ఆడిటోరియం నిర్మాణం ఇలా ఎన్నో పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రజలంతా ఏకమై కారు గుర్తుకు ఓటు వేసి, మున్సిపాలిటీలోని 20 మంది కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను భూస్థాపితం చేస్తాం

- బీఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, ఫిబ్రవరి 3;** రాష్ట్రంలోని ఒక్కొక్కరికి 60 వేల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని సిద్దిపేట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఎల్లు రవీందర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధి 14 వార్డులో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల బాకి కార్డులను ఇంటింటికి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో దివ్యాంగుల, వృద్ధులు, వితంతు పెన్షన్లను పెంచుతామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా.. ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు సూచనలతో కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కంటెం రాజు, నర్సింలు,ప్రభాకర్ రెడ్డి ,పత్రి శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో రాజకీయ ఉద్రిక్తత

- ఒకే వీధిలో రెండు పార్టీల ప్రచారం
- అడ్డుకున్న పోలీసులు

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 3:** సిద్దిపేట మున్సిపాలిటీలో ప్రస్తుతం ఎన్నికలు లేకపోయినా, రాజకీయ వాతావరణం మాత్రం తారాస్థాయిలో వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న ఇంటింటి ప్రచారం సిద్దిపేట పట్టణాన్ని పూర్తిగా రాజకీయ రంగస్థలంగా మార్చింది. ఒకరిపై ఒకరు ఆరోపణలతో, విమర్శలతో ప్రజల ముందుకు వెళ్లిన ఇరు పార్టీలు ప్రచారాన్ని మరింత ఉగ్రంగా సాగిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ "కాంగ్రెస్ బాకీ కార్డు" పేరుతో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తుండగా, దానికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు "బీఆర్ఎస్ డోకా కార్డు"ను చేతుల్లోకి తీసుకుని ఎదురుదాడికి దిగారు. ఈ రెండు ప్రచారాలు ఒకే సమయంలో సాగడంతో సిద్దిపేటలో రాజకీయ ఉద్రిక్తత ఒక్కసారిగా పెరిగిపోయింది.ఈ ప్రచారం సిద్దిపేట పట్టణంలోని 14వ వార్డులో తీవ్ర స్థాయికి చేరింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే వీధిలో ఒకేసారి ఇంటింటి ప్రచారానికి దిగడంతో ముఖాముఖి ఎదురుపడ్డారు. దీంతో పరస్పర నినాదాలు, ఆరోపణలు, ప్రతిఆరోపణలు హోరెత్తాయి. మాటల తూటాలు మరింత వేగం పుంజుకోవడంతో అక్కడి పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.ఉద్రిక్తతపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని అక్కడి నుంచి పంపించడంతో పెద్ద ఎత్తున జరిగే అవాంఛనీయ ఘటనలు తప్పినట్లు అయింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకే ఇంటింటి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నాయకుడు కొండం సంపత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆ విషయాలను ప్రజలకు తెలియజేయడానికే "బాకీ కార్డులు" పంపిణీ చేస్తున్నామని ఆయన అన్నారు.ఇప్పటికే ఇంటింటి ప్రచారమే రాజకీయ ఉద్రిక్తతలకు దారి తీస్తుండటంతో, రాబోయే రోజుల్లో సిద్దిపేట పట్టణంలో రాజకీయ ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎన్నికలు లేకపోయినా సిద్దిపేట రాజకీయాలు మాత్రం హై వోల్టేజ్ కరెంట్ లా మారుతున్నాయి.

# పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కు దరకాస్తుల స్వీకరణ గడువు పొడగింపు

- ఫిబ్రవరి 22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 3:** స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ లో గ్రూప్ 1,2,3,4, ఆర్ఆర్ బీ, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కు దరఖాస్తు చేసుకొనుటకు ఫిబ్రవరి 22 వరకు గడువును పొడిగించినట్లు టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. పోటీ పరీక్షలకు 5 నెలల ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycercle. co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని అనుసరిస్తున్నారు. రాహుల్ లాంటి నెగటివ్ ఆలోచనలు కలిగిన వ్యక్తులు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. దేశ పురోగతి గురించి వారికి పట్టింపు లేదు. రాహుల్ సహా విపక్ష ఎంపీలు పార్లమెంటులో స్పీకర్ పట్ల అవమానకరంగా ప్రవర్తించారు.
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

# భారత్, అమెరికా డీల్ తో ఎగుమతులు పెరుగుతాయ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదరడం పట్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను 50శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం శుభ పరిణామమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరడంతో ఇకపై భారత ఎగుమతులు పుంజుకుంటాయని అన్నారు. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని వెల్లడించారు. ఇది ఎగుమతిదారులకు మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. ''నా అంచనా ప్రకారం ఎగుమతులు మళ్లీ పుంజుకుంటాయి. గత కొన్ని నెలలుగా వారు అన్వేషించిన కొత్త రంగాల్లోకి కూడా విస్తరిస్తాయి. కాబట్టి ఇప్పుడు మన ఎగుమతులు నిజంగా ఊపందుకుంటాయి. ఇంకా చెప్పాలంటే ఎగుమతిదారులు కొత్త మార్కెట్లను కూడా కనుగొన్నారు. ఇది వారికి ఒక మంచి పరిణామం. అయితే, మరికొంత సమయం పరిస్థితిని గమనించిన తర్వాత మాట్లాడుతాను.'' మరోవైపు బడ్జెట్ భారత్ ఎదుర్కొంటున్న అసలు సంక్షోభాలకు దూరంగా ఉందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపైనా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఎలాంటి ఆధారం లేకుండా ఆయన చేసిన ఆరోపణలకు తాను విశ్వసనీయత కల్పిస్తున్నానని చెప్పారు. బడ్జెట్ లో ఉన్న నిర్దిష్ట లోపాలను ఆయన కచ్చితంగా వెల్లడించాలని కోరారు. బడ్జెట్ పై ఆయన చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు ''నేను దీనిపై రాహుల్‌కు సవాలు విసురుతున్నాను. యువతకు ఎలా శిక్షణ ఇస్తున్నారో, యువతకు పారిశ్రామికవేత్తలుగా మారడానికి ఎలా అవకాశాలు కల్పిస్తున్నారో, ఈ విషయాలన్నింటిలోనూ కృత్రిమ మేధస్సును ఎలా వాడుకుంటున్నామో వివరిస్తాను. ఆయన ఈ వాదనలతో ఎక్కడి వస్తారు? దయచేసి ఇలాంటి ఆరోపణలు చేసేటప్పుడు ఏదైనా పేరాను హైలైట్ చేయమని ఆయనకు చెప్పండి.'' అని అన్నారు.

## విశ్వ వీక్షణం

# మణిపూర్ సీఎంగా యుమ్నమ్ ఖేమ్ చంద్ సింగ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** స్థానిక తెగల మధ్య ఆధిపత్య పోరుతో సతమతమవుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న ముఖ్యమంత్రి పదవికి యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. బీజేపీ నాయకుడైన ఆయన బీరెన్ సింగ్ వారసుడిగా.. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. త్వరలోనే మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మణిపూర్‌లోని ప్రధానమైన మీటీస్, కుకిస్ తెగల మధ్య నిరుడు విభేదాలు తారా స్థాయికి చేరడంతో ముఖ్యమంత్రిగా నేను ఉండలేనంటూ నిరుడు ఫిబ్రవరి 9న బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి పోస్ట్ ఖాళీగా ఉంది. ఆయన వారుసుడిగా బాధ్యతలు చేపట్టేది ఎవరు? అనే చర్చ జోరుగా సాగింది. మాజీ స్పీకర్ యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్, క్యాబినెట్ మంత్రి బిస్వజిత్, సత్యబ్రతా సింగ్‌లలో ఒకరు తదుపరి సీఎం అవుతారనే వార్తలు వినిపించాయి. కానీ చివరకు బీజేపీ అధిష్టానం ఖేమ్‌చంద్ వైపు మొగ్గు చూపింది. దాంతో, మంగళవారం ఆయనను శాసన సభాపక్షనేతగా ఎన్నుకున్నారు. త్వరలోనే ఖేమ్‌చంద్ నేతృత్వంలో మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది. గతంలో అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన ఖేమ్‌చంద్ ఎన్నికల్లో ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని సింగ్జమేయి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.



**కొంతమంది నీరసంగా, బలం లేకుండా ఉంటారు. ఇలాంటి వారు ఏ చిన్న పనిచేసినా పూర్తిగా అలసిపోతారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తింటే మీకు వెంటనే బలం వస్తుంది. ఎనర్జిటిక్‌గా మారిపోతారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.**

మనం తినే ఆహారమే మన ఆరోగ్యం ఎలా ఉండాలో డిసైడ్ చేస్తుంది. అయితే కొంతమంది తినాల్సిన దానికంటే చాలా తక్కువగా తింటారు. లేదా ప్రోటీన్లను చాలా తక్కువ మొత్తంలో తీసుకుంటారు. దీనివల్ల ఒంట్లో శక్తి ఉండదు. శరీరం నీరసంగా, బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి వారు ఏ పనిచేయలేరు.

ఏ చిన్న పనిచేసినా వెంటనే అలసిపోతారు. అయితే కొన్ని రకాల ఆహారాలను తింటే మీ శరీరం తిరిగి బలంగా అవుతుంది. అలాగే వెంటనే మీకు శక్తి అందుతుంది. వీటిని రోజూ తింటే మీ శరీరం బలంగా మారుతుంది. ఎలాంటి రోగాలు లేకుండా ఉంటారు.

# ఇన్‌స్టంట్ ఎనర్జీ కావాలా?

### అరటిపండు

అరటిపండ్లు ఏ సీజన్లో అయినా సరే మార్కెట్ లో దొరుకుతాయి. ఈ పండ్ల ధర ఎక్కువ కాకపోయినా.. వీటిని తింటే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అరటిపండ్లలో మన శరీరానికి మేలు చేసే ఎన్నో రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అరటి పండ్లలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ బి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్ లు మీ శరీరానికి మంచి శక్తిని అందిస్తాయి. వీటిని తింటే తక్షణమే ఎనర్జీ అందుతుంది.

### గుడ్డు

గుడ్డు మంచి పోషకాహారం. వీటిని మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ లో తింటే మీరు రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటాయి. గుడ్లలో ప్రోటీన్లు, కోలిన్, ఎసెన్షియల్ అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ శరీర స్టామినాను పెంచడానికి ఎంతగానో సహాయపడతాయి. రోజూ ఒక ఉడకబెట్టిన గుడ్డును తింటే మీరు హెల్తీగా ఉండటంతో పాటుగా మీ ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

### డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్ ను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు. ఇది టేస్టీగా ఉండటమే కాకుండా.. మన ఆరోగ్యానికి కూడా ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. ముఖ్యంగా ఇది బలహీనంగా ఉన్నవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్లో థియోబ్రోమైన్ అనే రసాయనం ఉంటుంది. ఇది కెఫిన్ లాగే మంచి ఎనర్జీని, మానసిక ప్రశాంతతను అందిస్తుంది.

### బాదం పప్పు

బాదం పప్పుల్లో కూడా మన శరీరానికి ప్రయోజనకరంగా ఉండే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బాదం పప్పుల్లో ఫైబర్, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇది మీ శరీరానికి మంచి స్టామినాను అందిస్తాయి. అలాగే బాదం పప్పులు పోషకాల లోపాలను కూడా పోగొడుతాయి.

### ఓట్ మీల్

ఓట్ మీల్ కు మించిన మంచి బ్రేక్ ఫాస్ట్ ఉండదు. ఎందుకంటే ఇది మన శరీరానికి అవసరమైన ఎన్నో రకాల పోషకాలను అందిస్తుంది. అలాగే రోజుకు అవసరమైన శక్తిని కూడా అందిస్తుంది. ఓట్స్ లో విటమిన్ బి కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీకు స్థిరమైన స్టామినాను అందిస్తాయి.

### పల్లీలు

పల్లీలు కూడా మన ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తాయి. వీటిలో ప్రోటీన్లు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు,ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి అవసరమైన శక్తిని అందించి స్టామినాను పెంచుతాయి.

### పుల్లని పండ్లు

నిమ్మకాయ, నారింజ, ఉసిరి వంటి పుల్లని పండ్లు మన ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. వీటిలో విటమిన్ బి 6, కాల్షియం, ఫైబర్, ఫోలేట్, థయామిన్ లు మెండుగా ఉంటాయి. ఇవి మన శరీర స్టామినాను బాగా పెంచుతాయి. అలాగే ఇమ్యూనిటీ పవర్ ను పెంచడానికి బాగా సహాయపడతాయి. వీటిని తింటే రోగాలొచ్చే ముప్పు తగ్గుతుంది.

# స్పీకర్ పైకి పేపర్లు చించి విసిరేశారు

- ఎనిమిది మంది ఎంపీల సస్పెన్షన్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** లోక్‌సభలో మంగళవారం 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పేపర్లు చింపి చైర్‌పై విసిరేసిన ఘటనలో ఈ చర్యలు తీసుకున్నారు. చైర్‌లో దిలీప్ సైకియా ఉన్న సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు తమకు మైక్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ పేపర్లను చింపి విసిరేశారు. సస్పెండ్ అయిన వారిలో మానికం ఠాగూర్, గురీత్ ఓజ్లా, రాజా వారింగ్, ఎబి ఈడెన్, కిరణ్ రెడ్డి, వెంకట్ రామన్ ఉన్నారు. చైర్‌పై పేపర్లు విసిరేయడాన్ని స్పీకర్ ఖండించారు. పార్లమెంటరీ హుందాతనాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు. బడ్జెట్ సెషన్‌లో ఇలాంటి ఘటనలను ఉపేక్షించలేమన్నారు. 8 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత లోక్‌సభను బుధవారానికి వాయిదా వేశారు.

పార్లమెంట్‌లో సమస్యలను లేవనెత్తే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, సభ అందరిదని, చర్చలు జరగాలని, కానీ సభా వ్యవహారాలను అడ్డుకోవడం సరికాదు అని, నిరసన పేరుతో సభా నిర్వహణను స్తంభింపచేయడం కుదరదని దిలీప్ సైకియా అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తప్పుపట్టారు. ప్రతి సభ్యుడిని మాట్లాడే హక్కు ఉందని, వారి ఆందోళనలను వినిపించుకోవాలని ఆమె అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

# లక్షల్లో ఓట్లు తొలగించారు

- ఈసీపై మమతా బెనర్జీ ఫైర్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ప్రక్రియలో బాధితులకు కనీసం తమ వాదన వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఎస్ఐఆర్ బాధితులను పక్కనబెట్టుకుని మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేవలం విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలనే టార్గెట్ చేశారని, బీజేపీ పాలిత రాష్ట్రాలను వదిలేశారని ఆమె మండిపడ్డారు. మమత బెనర్జీ తనతో పాటు బంగాల్ నుంచి వచ్చిన బాధితులను మీడియాకు పరిచయం చేశారు. ''నా వెనుక కూర్చున్న వీరంతా ఎస్ఐఆర్ బాధితులే. వీరి పేర్లను అన్యాయంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. నేను కేవలం కొంత మందిని మాత్రమే ఇక్కడికి తీసుకురాగలిగాను. తలచుకుంటే ఇలాంటి లక్షల మంది బాధితులను దిల్లీకి తీసుకురాగలను. వీరికి జరిగిన అన్యాయంపై మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వడం లేదు'' అని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వాట్సాప్ ప్రైవసీ.. మెటా కంపెనీకి సుప్రీంకోర్టు వార్నింగ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** వాట్సాప్ ఓనర్ మెటా కంపెనీకి .. సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. వాట్సాప్ ప్రైవసీ పాలసీ అంశంలో కోర్టు తన హెచ్చరిక జారీ చేసింది. ఓ కేసులో ఇవాళ సుప్రీంలో వాదనలు జరిగాయి. మా దేశ ప్రైవసీతో మీరు ఆటలాడుకోలేరని, మాకు చెందిన సింగిల్ డిజిట్ డేటాను కూడా షేర్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వబోమని, మా దేశ చట్టాలను ఫాలో అవ్వకుంటే, మీరు ఈ దేశాన్ని విడిచి వెళ్లవచ్చు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీపై కోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. యూజర్ డేటాను కమర్షియల్ అవసరాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. మా రాజ్యాంగాన్ని అనుసరించలేని పక్షంలో.. ఇండియాను వదిలివెళ్లాలన్నారు. పౌరుల గోప్యతను బహిరంగ పరచడాన్ని అమనుతించబోమన్నారు. ప్రైవసీ పాలసీ నిరక్ష్యరాసులకు ఎలా అర్థం అవుతుందని కోర్టు ప్రశ్నించింది. కొన్ని సందర్భాల్లో మీ పాలసీలు అర్థం చేసుకోవడం మాకే ఇబ్బందిగా మారుతుందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ప్రైవసీ ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు.




## ఆడకపోతే నష్టమే!
## పీసీబీని హెచ్చరించిన ఐసీసీ

టీ20 ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ కీలక పోరుపై సందిగ్ధత కొనసాగుతున్నది. ఇప్పటికే పాకిస్థాన్ ప్రభుత్వం ఈనెల 15న కొలంబోలో టీమ్‌ఇండియాతో తాము ఆడబోమంటూ ప్రకటించిన నేపథ్యంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే దాదాపు రూ.2వేల కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోవల్సి వస్తుందని పేర్కొన్న ఐసీసీ తాజాగా పీసీబీకి మరోమారు హెచ్చరికలు పంపింది. ఆర్థిక పరంగానే కాకుండా మ్యాచ్ బహిష్కరించిన కారణంగా ఏర్పడే నష్టంపై ప్రసారదారులు పీసీబీపై కోర్టుకు వేళ్లే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలో వార్షిక ఆదాయం కింద వచ్చే రూ.3,161 కోట్ల నుంచి బ్రాడ్‌కాస్టర్లకు చెల్లించే ఆలోచనలో ఐసీసీ ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే జరిగే పరిణామాలపై గత వారమే బోర్డు న్యాయ నిపుణులతో భేటీ అయిన తర్వాతనే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను పీసీబీ చీఫ్ మోహిసిన్ నఖ్వి కలిసినట్లు సమాచారం. 'ఈనెల 7 నుంచి మొదలయ్యే మెగాటోర్నీలో భారత్‌తో పాక్ ఆడకపోతే పాక్ తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుంది. ఆర్థిక పరంగానే కాకుండా ద్వైపాక్షిక సిరీస్‌లు, వార్షిక ఆదాయంలో కోత లాంటివి ఎదుర్కొవాల్సి వస్తుంది. తాము కోల్పోయే ఆదాయంపై అధికారిక స్పాన్సర్ జియో హాట్ స్టార్.. పీసీబీపై కోర్టుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఈ వివాదంపై వివాదాల పరిష్కార కమిటీ(డీఆర్‌సీ)ని సంప్రదించినా పీసీబీకి నిరాశే ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐసీసీ బోర్డులో మెజార్టీ సభ్యదేశాల నిర్ణయాన్ని డీఆర్‌సీ సవాలు చేసే చాన్స్ లేకపోవడమే దీనికి కారణం'అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

# డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఢిల్లీ

## ఎలిమినేటర్ పోరులో ఓడిన గురాత్

మహిళల ప్రీమియర్ లీగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరింది. టోర్నీ ఆరంభ దశలో పడుతూ లేస్తూ ఆడిన ఆ జట్టు.. కీలకమైన ఎలిమినేటర్ పోరులో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటింది. వడోదరలో గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన పోరులో ప్రత్యర్థిని 7 వికెట్ల తేడాతో చిత్తుచేసిన ఢిల్లీ.. ఈనెల 5న ఇదే వేదికలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో అమీతుమీ తేల్చుకోనుంది. గుజరాత్ నిర్దేశించిన 169 పరుగుల లక్ష్యాన్ని క్యాపిటల్స్ 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. లిజెల్లె లీ (24 బంతుల్లో 43, 8 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (23 బంతుల్లో 41, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 వద్దే పరిమితమైంది. బెత్ మూనీ (51 బంతుల్లో 62 నాటౌట్, 6 ఫోర్లు), జార్జియా వర్హైమ్ (35) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఎప్పట్లాగే ఢిల్లీకి ఓపెనర్లు మెరుపు ఆరంభాన్నిచ్చారు. లీ, షెఫాలీ (21 బంతుల్లో 31, 7 ఫోర్లు) దూకుడుగా ఆడటంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 75 రన్స్ చేసింది. మొదట రాజేశ్వరి 3వ ఓవర్లో షెఫాలీ రెండు బౌండరీలు బాదగా డివైన్ ఓవర్లో రెండు ఫోర్లతో కలుపుకుని 17 పరుగులొచ్చాయి. రేణుకా 5వ ఓవర్లో అయితే లీ హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగగా షెఫాలీ రెండుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించింది. వర్హైమ్ రాకతో గుజరాత్‌కు డబుల్ బ్రేక్ దక్కింది. ఆమె వేసిన 8వ ఓవర్ తొలి బంతికి లీ వికెట్ల ముందు దొరికిపోగా ఆఖరి బంతికి షెఫాలీ వర్హైమ్‌కే క్యాచ్ ఇచ్చి నిష్క్రమించింది. కానీ అప్పటికే ఢిల్లీ లక్ష్యంలో సగాన్ని ఊదేసింది. వారి స్థానాల్లో క్రీజులోకి వచ్చిన వోల్వార్ట్ (32*), జెమీమా నిలకడగా ఆడి ఆ జట్టును గెలుపు దిశగా మరింత చేరువ చేశారు. క్రీజులో కుదురుకున్నాక ధాటిగా ఆడిన జెమీమా.. విజయానికి 9 పరుగుల దూరంలో ఔట్ అయినా వోల్వార్ట్, కాప్ (4*) లాంఛనాన్ని పూర్తిచేశారు. రెండో ఓవర్లోనే డెవిన్ (6) వికెట్‌ను కోల్పోయినా పవర్ ప్లేలో గుజరాత్ నిలకడగానే ఆడింది. కాప్ వేసిన 4వ ఓవర్లో 17 పరుగులు రాబట్టి జోరు మీద కనిపించిన ఆ జట్టుకు ఆరో ఓవర్లో బంతినందుకున్న నందని వరుస బంతుల్లో షాకిచ్చింది. తొలి బంతికి అనుష్క (16)ను వెనక్కిపంపిన ఆమె.. రెండో బంతికి గుజరాత్ సారథి ఆష్లీ గార్డ్‌నర్‌ను డకౌట్ చేసి కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో గుజరాత్ స్కోరు వేగం నెమ్మదించింది. 9వ ఓవర్లో మిన్ను మణి.. కనిక అహూజా (6)నూ బోల్తా కొట్టించడంతో క్రీజులోకి వచ్చిన వర్హైమ్ (35)తో కలిసి మూనీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. కానీ హెన్రీ 17వ ఓవర్లో గుజరాత్‌కు డబుల్ షాకులిచ్చింది. వర్హైమ్‌తో పాటు ఫల్మలిని ఔట్ చేసి ఆ జట్టు భారీ స్కోరు చేయకుండా అడ్డుకట్ట వేసింది.

## డబ్ల్యూ పీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్

డబ్ల్యూపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లోకి అడుగుపెట్టబోతున్నదా? అంటే అవుననే అంటున్నారు ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్. సీఎస్‌కేను క్రికెట్ తో పాటు ఇతర క్రీడల్లోనూ విస్తరించాలనుకుంటున్న యాజమాన్యం ముందుగా డబ్ల్యూపీఎల్ లో అడుగిడాలని భావిస్తున్నది. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో విశ్వనాథన్ మాట్లాడుతూ.. 'ఇప్పటికిప్పుడైతే కాదు గానీ రాబోయే రోజుల్లో సీఎస్‌కేను విస్తరిస్తాం. ముందుగా మేం మహిళల క్రికెట్ లో రానున్నాం. ఆ తర్వాత అన్ని క్రీడల్లోకి అడుగిడుతాం' అని చెప్పాడు.

## భారత్‌లో ఆసియా ఛాంపియన్‌షిప్

లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో ఎక్కువ బెర్తులు దక్కించుకుని పారిస్ కంటే ఎక్కువ పతకాలు నెగ్గాలనే లక్ష్యంతో ఉన్న భారత షూటర్లకు సదావకాశం. 2028 క్రీడల్లో 8 బెర్తులను ఖాయం చేసే ఆసియా రైఫిల్ /పిస్టోల్ చాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వబోతున్నది. వచ్చే ఏడాది ఢిల్లీలో జరుగబోయే ఈ టోర్నీకి సంబంధించి తేదీలు ఖరారు కాకపోయినా బిడ్‌ను దక్కించుకున్నట్టు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) అధ్యక్షుడు కలికేశ్ సింగ్ దేవ్ తెలిపారు. ఈ టోర్నీ కంటే ముందే భారత్.. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి 30 వరకు జరగాల్సి ఉన్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ రైఫిల్ /పిస్టోల్ /షాట్ గన్ పోటీలకు ఆతిథ్యమివ్వనున్నది. ఇది కూడా ఒలింపిక్స్‌కు క్వాలిఫికేషన్ (ఇందులో 12 బెర్తులున్నాయి) ఈవెంట్ కావడం విశేషం. స్థానికంగా ఉండే పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ మన షూటర్లు ఎలా రాణిస్తారో చూడాలి. పారిస్ ఒలింపిక్స్‌లో 22 మంది షూటర్లు భారత్ నుంచి పోటీలో ఉండగా లాస్ ఏంజెల్స్‌లో ఆ సంఖ్యను 24కు పెంచాలనే లక్ష్యంతో ఎన్ఆర్ఏఐ ప్రణాళికలు రూపొందిస్తున్నది.

## కింగ్ @ 100

సుదీర్ఘ కెరీర్‌లో అగ్ర నటుడు నాగార్జున వందో సినిమా మైలురాయిని చేరుకున్నారు. ఈ ప్రయాణంలో అనేక ప్రయోగాలు, బాక్సాఫీస్ సూపర్‌హిట్స్ ఆయన ఖాతాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జున వందో సినిమా కోసం ఆయన అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు 'కింగ్ 100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. ఈ సినిమా కొత్త షెడ్యూల్ త్వరలో మైసూర్‌లో మొదలుకానుంది. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన వార్త బయటికొచ్చింది. ఓ సాధారణ వ్యక్తి లాటరీల ద్వారా కోటీశ్వరుడిగా ఎదిగిన వైనం, ఈ క్రమంలో చోటు చేసుకునే పరిణామాల నేపథ్యంలో పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారట. నాగార్జున సరికొత్త మేకోవర్‌తో కనిపించబోతున్నారని, యాక్షన్ ఘట్టాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ఈ సినిమాలో సీనియర్ నటి టబు కీలకమైన అతిథి పాత్రలో నటించనుందట. ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఏప్రిల్ 3న 'బైకర్' రిలీజ్

నారీ నారీ నడుమ మురారి తో సంక్రాంతి బ్లాక్ బస్టర్ ని అందుకున్న చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్' లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఈ సినిమా ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్, సాంగ్ తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు .ఏప్రిల్ 3న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. అనౌన్స్మెంట్ పోస్టర్లో శర్వా బైకర్ లుక్ లో కనిపించడం అదిరిపోయింది. 1990, 2000 బ్యాక్ డ్రాప్ లో సాగే "బైకర్" రేసింగ్ యాక్షన్ తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. స్పీడ్, అంబిషన్, హార్ట్‌ఫెల్ట్ రిలేషన్‌షిప్స్ తో మూడు జనరేషన్స్ ఒకే రేసింగ్ కలతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ.

## 'బ్లడీ రోమియో'తో..

దాదాపు నాలుగేళ్లుగా తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంది పూజాహెగ్డే. బాలీవుడ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ అవకాశాలు తగ్గిపోయాయి. అయితే వరుస ఫెయిల్యూర్స్ దృష్ట్యా ప్రస్తుతం ఈ భామ తెలుగు ఇండస్ట్రీపై దృష్టిపెడుతున్నది. ఇటీవలే దుల్కర్ సల్మాన్ నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఆమెను కథానాయికగా ఖరారు చేశారు. 'డీక్యూ 41' వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. సుజీత్ దర్శకత్వంలో నాని 'బ్లడీ రోమియో' అనే చిత్రంలో నటించబోతున్నారు. వేసవిలో ఈ సినిమా సెట్స్‌మీదకెళ్లనుంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇందులో పూజాహెగ్డేను కథానాయికగా ఖరారు చేశారని సమాచారం. త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. దళపతి విజయ్ సరసన పూజాహెగ్డే కథానాయికగా నటించిన 'జన నాయగన్' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

## అమర్ దీప్ కు రవితేజ అభినందన

అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సుమతీ శతకం'. ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నది. జీరో కట్స్‌తో ఈ సినిమా యు.ఏ సర్టిఫికెట్ పొందిందని, సెన్సార్ వారు కూడా అభినందించారని మేకర్స్ తెలిపారు. ఇదిలావుండగా ఈ సినిమా కంటెంట్ చూసిన అగ్ర హీరో రవితేజ చిత్రబృందాన్ని అభినందించారు. తాను రవితేజ అభిమానినని, ఆయన్నుంచి ప్రశంస రావడం ఆనందంగా ఉందని హీరో అమర్దీప్ చౌదరి తెలిపారు. టేస్టీ తేజ, మహేష్ విట్ట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్.హాలేష్, సంగీతం: సుభాష్ ఆనంద్, రచనదర్శకత్వం: ఎం.ఎం.నాయుడు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200